# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ — జ జనం — జన శ్రేయస్సే మా బాధ్యత

సంపుటి : 02 సంచిక : 01, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం -30 - ఏప్రిల్ - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## కెనడా ఎన్నికల్లో భారత్ అనుకూల మార్క్ కార్నీ

### ఘన విజయం.. శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ




ట్రూడో హయాంలో దెబ్బతిన్న భారత్-కెనడా సంబంధాలు

సంబంధాల పునరుద్ధరణకు కార్నీ సుముఖత

ద్వైపాక్షిక, వాణిజ్య బంధాలు మెరుగుపడే సూచనలు

## ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ ను ఏకిపారేసిన భారత్




పాకిస్థాన్ ఒక బాధ్యతారాహిత్య దేశమన్న భారత్

ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని మండిపాటు

ప్రపంచం దీన్ని చూసీ చూడనట్టు వదిలేయకూడదని వ్యాఖ్య

## ఏపీ మెగా డీఎస్సీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థుల విషయంలో కీలక నిర్ణయం

- ఏపీలో 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ




- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు డిగ్రీలో 40 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
- ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## ఉగ్రదాడి నేపథ్యంలో

# మోదీకి రాహుల్ గాంధీ లేఖ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కోరిన రాహుల్

దాడి బాధితులకు నివాళి, భవిష్యత్ చర్యలపై చర్చకు పిలుపు

ఉగ్రవాదంపై దేశం ఐక్యత చాటాలని లేఖలో విజ్ఞప్తి



ఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంయుక్తంగా ఈ లేఖను పంపారు. పహల్గామ్ దాడి పరిణామాలపై చర్చించేందుకు వీలైనంత త్వరగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు తమ లేఖలో ప్రధానిని కోరారు.


మిగతా.. 2లో


## చంద్రబాబు చేస్తున్న విధ్వంసం

# అంతా ఇంతా కాదు

### జిల్లాల్లో మీరే సర్వం. మీరే పార్టీ.. పార్టీయే మీరు

జిల్లాలో పార్టీ ఓనర్‌షిప్ మీది

మే నెలలోపు మండల కమిటీలు పూర్తిచేయాలి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది

మనమంతా రాజకీయ నాయకులం

మద్దతు ధరలు దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు



గుంటూరు: సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదంటూ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులతో ఆయన సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు సహా అనేక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతాకాదు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్నిరంగాల్లోనూ విద్వంసమే. రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలవుతోంది. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది. వీటిని ప్రజల్లోకి బాగా తీసుకువెళ్లాలి' అని సూచించారు.



### జిల్లాలో పార్టీ ఓనర్‌షిప్ మీది

ప్రజా సంబంధిత అంశాల్లో ఒకరి ఆదేశాలకోసం మీరు ఎదురు చూడొద్దు. మీకు మీరుగా స్వచ్ఛందంగా కదలాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జితో కలిసి మొదట కదలాల్సిందే మీరే. ప్రజలకు అండగా మీరు చేస్తున్న కార్యక్రమాల వల్ల


మిగతా.. 2లో





## అలా మాట్లాడితే... పాకిస్థాన్‌కే వెళ్లిపోండి డిప్యూటీ సీఎం పవన్

- పహల్గామ్ దాడి నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం కీలక వ్యాఖ్యలు
- మత ప్రాతిపదిక 26 మందిని చంపినా పాక్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్న పవన్
- అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలన్న జనసేనాని
- ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలన్న డిప్యూటీ సీఎం

## బీఆర్ఎస్ కక్కుర్తి వల్ల

# చాలా నష్టం జరిగింది



- గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలింది
- కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరంతరం బీఆర్ఎస్‌వాళ్లు తప్పుడు ప్రచారాలు చేశారు
- ఎన్‌డిఎస్ఏ అథారిటీ బిల్లుకు పార్లమెంట్‌లో బిఆర్ఎస్ మద్దతు పలికింది
- దేశంలో ఏ బ్యారేజీకి ఎలాంటి సమస్య వచ్చినా ఎన్‌డిఎస్ఏ నుంచే అభిప్రాయం చెప్తుంది

హైదరాబాద్: మేడిగడ్డ ప్రాజెక్టు కట్టింది.. కూలిపోయింది.. ఈ విషయాన్ని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికగా ఇచ్చిందని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికపై తెలంగాణ సచివాలయంలో మంగళవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారాయన. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించింది


మిగతా.. 2లో


## పద్మభూషణ్ అవార్డును అందుకోవడంపై బాలకృష్ణ స్పందన




రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మభూషణ్ అందుకున్న బాలకృష్ణ

సరైన సమయానికే పద్మభూషణ్ పురస్కారం వచ్చిందన్న బాలయ్య



## హైకోర్టును ఆశ్రయించిన ముగ్గురు ఐపీఎస్‌లు

భూదాన్ భూముల వ్యవహారంలో కొద్ది రోజుల క్రితం హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ

26 మంది ఆఫీసర్లకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని సింగిల్ బెంచ్ తీర్పు



తీర్పు వెలువడే వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులకు స్పష్టం


మిగతా.. 2లో


## మిస్ వరల్డ్ పోటీలపై

# సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

### మే 10న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీలు



- అతిథులు, పోటీదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం ఆదేశం
- విమానాశ్రయం, హోటళ్లు, చారిత్రక ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతకు సూచన
- గర సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

హైదరాబాద్: ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ - 2025 పోటీలకు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న సన్నాహక పనులను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. మే 10వ తేదీ నుంచి మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయని


మిగతా.. 2లో


## స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్

- భగవద్గీతలోని అంశాన్ని తన బదిలీకి అన్వయిస్తూ ట్వీట్ చేశారు
- కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన




- 4 నెలలు టూరిజం అభివృద్ధి కోసం నా వంతు కృషి చేశాను
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న టూరిజం పాలసీ 25-30లో రాష్ట్రానికి పరిచయం చేశాను”


మిగతా.. 2లో


## నేడు విజయవాడకు

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

### టీడీపీ నేత దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుకకు వెళ్లనున్న రేవంత్

- గత వారం రేవంత్ నివాసానికి వెళ్లి పెళ్లికి ఆహ్వానించిన దేవినేని ఉమా
- వివాహ వేడుకలో చంద్రబాబును రేవంత్ కలిసే అవకాశం



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఏపీలో పర్యటించనున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుకలో పాల్గొనేందుకు ఆయన బెజవాడకు వెళ్లనున్నారు. నేడు ఉదయం 9.15 గంటలకు రేవంత్ రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి


మిగతా.. 2లో

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు

మొదటి పేజి తరువాయి

ప్రజలకు అండగా మీరు చేస్తున్న కార్యక్రమాల వల్ల అది రాష్ట్రస్థాయి దృష్టిని ఆకర్షిస్తుంది. దీనిద్వారానే మీ పనితీరు బయటపడుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ మన్ననలు పొందాల్సిన బాధ్యత మీది. సమాజంలో గొంతులేని వారికి బాసటగా నిలిచేది వైయస్సార్‌సీపీయే. ప్రతి సమస్యలోనూ బాధితులకు తోడుగా నిలిచేది వైఎస్సార్‌సీపీయే.

**మే నెలలోపు మండల కమిటీలు పూర్తిచేయాలి**

జూన్‌-జులైల్లో గ్రామస్థాయి, మున్సిపాల్టీలల్లో డివిజన్ కమిటీలు పూర్తిచేయాలి. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో బూత్ కమిటీలు ఏర్పాటు కావాలి. ఈమేరకు లక్ష్యంగా పెట్టుకోండి. జిల్లా స్థాయి నుంచి పార్టీని గ్రామస్థాయి వరకూ తీసుకువెళ్లే బాధ్యతల్లో మీరు ఉన్నారు. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగాలి. జిల్లా అధ్యక్షుల పాత్ర పార్టీలో చాలా కీలకమైనది. గ్రామస్థాయి బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటు అనేది అత్యంత కీలక విధుల్లో ఒకటి. పార్టీలో సమర్థులు ఎవరు, ప్రతిపక్షంలో ఎవరు లీడ్ చేయగలరు అని ఆలోచన చేసి మీకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. మీమీ జిల్లాల్లో పార్టీ మీద మీకు పట్టు ఉండాలి. పార్టీ బలోపేతం కోసం గట్టిగా కృషిగా చేయాలి. బాధ్యతల నుంచే అధికారం వస్తుంది.

**జిల్లాల్లో మీరే సర్వం. మీరే పార్టీ.. పార్టీయే మీరు**

జిల్లాల్లో అన్నిస్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత మీది. మనసా వాచా కర్మేణా అదే తలంపుతో పార్టీని నడపాలి. జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో గెలిపించే బాధ్యత మీది. అది మీ ప్రధాన బాధ్యత. దీనికోసం ఏం చేయాలన్నదానిపై మీరు గట్టిగా పనిచేయాలి. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ప్రతి కమిటీ బలంగా ఉండాలి. ఏదైనా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనితీరు బాగోలేకపోతే పిలిచి చెప్పగలగాలి. అప్పటికీ పనితీరు బాగోలేకపోతే ప్రత్యామ్నాయం చూడ్డంలో మీ భాగస్వామ్యం కీలకం. పార్టీలో ఇద్దరి మధ్య వివాదం ఉన్నప్పుడు పిలిచి సమన్వయం చేయాల్సిన బాధ్యత మీది. మీ పరిధిలో 7కు ఏడు గెలిపించాల్సిన బాధ్యత మీది. బాధ్యత, అధికారం రెండూ తీసుకోండి. మీరు సమర్థులని భావించి, మీకు ఈ బాధ్యతలు అప్పగించడం జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయం చేయడం, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ కమిటీ నిర్మాణం మీ ప్రధాన బాధ్యత. అలాగే ప్రజా సంబంధిత అంశాల్లో చురుగ్గా ఉండాలి.

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది. భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ బయటపడుతుంది. అప్పుడే ఆ బ్యాట్స్‌మెన్ ప్రజలకు ఇష్టుడు అవుతాడు. ఇదికూడా అంతే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనం చేసే పనులవల్ల మనం ఎలివేట్ అవుతాం. ప్రజల దగ్గర, పార్టీలోనూ గౌరవం పెరుగుతుంది. ఇమేజీ పెరుగుతుంది. మన పనితీరు వల్లే మనం మన్ననలను పొందగలుగుతాం. అందరూ ధోనీల్లా తయారు కావాలి. అప్పుడే మీ జిల్లాల్లో ఏడుకు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో గెలవగలుగుతాం. జిల్లాల్లో ఏ జరిగినా మీరు ప్రజల తరఫున నిలబడాలి.కార్యక్రమాలు చురుగ్గాచేయాలి, ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలి. ప్రజా వ్యతిరేక అంశాలమీద గట్టిగా పోరాటం చేయాలి. లేదంటే పార్టీపరంగా మనం అవకాశాలను కోల్పోయినట్టే. బాధితులకు మనం అండగా ఉండాలి.

మనమంతా రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాలకోసం పెట్టామనే విషయం మరిచిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు వచ్చిన అవకాశాలను వదిలిపెట్టకూడదు. జిల్లాస్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను మీరు బాగా వెలుగులోకి తీసుకు వస్తేనే ప్రజలకు దగ్గరవుతాం. మనం అధికారంలోకి వస్తేనే ప్రజలకు మరింత మంచి చేయగలం. ప్రజలకు మరింత మంచి చేయాలన్న తపన, తాపత్రయం ఉంది కాబట్టే రాజకీయాలు చేస్తున్నాం. నాన్నగారు చనిపోయిన తర్వాత ప్రతి ఇంట్లో నా ఫొటో ఉండాలనుకున్నాను కాబట్టే నేను రాజకీయాలు చేస్తున్నాను. అలాగే ప్రతి జిల్లాల్లో మీ సేవల గురించి మాట్లాడుకోవాలి. రెండు మూడు సంవత్సరాలు అయితే కాని ప్రభుత్వ వ్యతిరేకత సాధారణంగా బయటకు కనిపించదు. కాని ఏడాదిలోపే ప్రభుత్వంమీద వ్యతిరేకత తీవ్రంగా ఉంది. అందుకే యుద్ధ ప్రాతిపదికన కమిటీ నిర్మాణం పూర్తిచేయాలి. దీని తర్వాత పార్టీ పరంగా మీకూ, నాకూ పూర్తిగా పని ఉంటుంది. అందరం కలిసికట్టుగా పార్టీపరంగా కార్యక్రమాలు బలంగా ముందుకు తీసుకెళ్లాలి. అందుకనే పార్టీ పరంగా నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలి. గ్రామస్థాయిలోకూడా కమిటీలు, బూత్ కమిటీల ఏర్పాటు పూర్తిచేస్తే పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉన్నట్టు అవుతుంది ప్రతి జిల్లాల్లో పార్టీ నిర్మాణం ద్వారా దాదాపు 12వేల మంది పార్టీ కార్యక్రమాలకోసం మీకు అందుబాటులో ఉంటారు. ప్రతి నియోజకవర్గంలో కూడా దాదాపుగా 1500 మంది ఉంటారు.

**మద్దతు ధరలు దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు**

వివిధ జిల్లాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల తరఫున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు జిల్లాల్లో రైతులకు అండగా ఉండాలి. రైతుల డిమాండ్లపై పోరాటం చేయాలి.

# హైకోర్టును ఆశ్రయించిన ముగ్గురు ఐపీఎస్‌లు

హైదరాబాద్: పలువురు ఐపీఎస్‌లు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. భూదాన్ భూముల వ్యవహారంలో కొద్ది రోజుల క్రితం హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 26 మంది ఆఫీసర్లకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. ఈ నెల 24న సింగిల్ బెంచ్ జస్టిస్ భాస్కర్‌రెడ్డి తీర్పు వెల్లడించారు. సింగిల్ బెంచ్ తీర్పుపై ముగ్గురు ఐపీఎస్‌లు అప్పీల్ చేశారు. మహేష్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ విచారణ జరి పించాలని హైకోర్టు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సన్న ద్ధంగా ఉన్నారా? లేరా? అనే దానిపై వైఖరిని తెలియజేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా కీలక స్థానాల్లోని ఉన్నతాధికారులని, వారిపై ఆరోపణలు కూడా అంతే తీవ్రంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. తీర్పు వెలువడే వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులకు స్పష్టం చేసింది. తమ ముందున్న పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారాన్ని రాజ్యాంగం కల్పించిందని, ఆ మేరకు ఆర్టికల్ 226ను వినియోగించుకుని ఈ ఆదేశాలు ఇస్తున్నామని తేల్చిచెప్పింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం సహా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ప్రతివాదులకు స్పష్టంచేసింది. అదీగాక, ఆరోపణల తీవ్రత దృష్ట్యా పిటిషన్ ఉపసంహరించుకునే అవకాశాన్ని పిటిషనర్‌కు ఇవ్వడం లేదని పేర్కొంది. ఒకవేళ పిటిషనర్ ఉపసంహరించుకోవాలని భావించినా అనుమతించవద్దని రిజిస్ట్రీని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూ కబ్జాలపై ఫిబ్రవరి 16న, మార్చి 8న అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసే చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే కొందరు అనధికారికంగా భూములను బదిలీ కూడా చేయించుకున్నారని చెప్పారు. 26 మంది ఉన్నతాధికారులు భూకబ్జాలో ఉన్నందున ఈ అంశంపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం గత గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. 'భూదాన్ భూములపై బినామీల పేరిట రిజిస్ట్రేషన్, భూ కబ్జా, మనీలాండరింగ్‌పై విచారణ జరిపించాలని మహేశ్ పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కుంభకోణంలో ఉన్నారు. కొందరు అధికారులకు అందజేసిన పట్టాదారు పాస్‌బుక్‌లు, మ్యుటేషన్ ప్రొసీడింగ్‌లపై వివరాలు సమర్పించేలా రిజిస్ట్రేషన్, స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేయండి. భూకబ్జాలో తెలంగాణతోపాటు ఏపీకి చెందిన సీనియర్ అధికారుల పాత్ర ఉంది. పిటిషనర్‌కు హక్కుగా ఉన్న భూమిని మోసపూరితంగా బదిలీ చేసుకున్నట్లు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు చూపించారు. అధికారులు భూరికార్డులను ఎలా తారుమారు చేశారో, తప్పుడు వారసత్వ పత్రాలు ఎలా తయారయ్యాయో.. పట్టాదార్ పాస్‌బుక్‌లను చట్టవిరుద్ధంగా ఎలా జారీ చేశారో దర్యాప్తు చేయాల్సి ఉంది. ధరణి పోర్టల్‌ను కూడా దుర్వినియోగం చేశారు. తన భూమి కోసం పోరాడుతున్న పిటిషనర్‌కు సాయం చేసే బదులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే 10కిపైగా లీగల్ నోటీసులు పంపారు. క్షమాపణ చెప్పకపోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. మోసపూరిత పాస్‌బుక్‌లను రద్దు చేయాలి. భూమిని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవాలి. సంబంధిత అధికారులపై విచారణకు ఆదేశించాలి' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇది అతి పెద్ద భూ కుంభకోణంలా కనిపిస్తున్నందున ఆ భూములకు సంబంధించి తదుపరి లావాదేవీలన్నింటినీ నిలిపివేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేశారు.

# బీఆర్ఎస్ కక్కుర్తి వల్ల చాలా నష్టం జరిగింది

మొదటి పేజి తరువాయి

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించింది బాధ్యత గల పౌరుడిగా మాట్లాడుతున్నా. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరంతరం బీఆర్ఎస్‌వాళ్లు తప్పుడు ప్రచారాలు చేశారు. 16 లక్షల ఎకరాల ఆయకట్టు కోసం.. 38వేల కోట్లతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం అనాడు వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్, రీ డిజైనింగ్ చేసింది. కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాలు పెంచింది. కమీషన్లకక్కుర్తి కోసం ప్రాణహిత డిజైన్ మార్చింది. చివరకు తుమ్మిడిహెట్టి వద్ద కట్టాల్సిన బ్యారేజి...మేడిగడ్డ వద్ద వంద మీటర్ల హైట్ తో కట్టారు. దీని వల్ల ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాకు తీవ్ర నష్టం జరిగింది. తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చే బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద తప్పు చేసింది. బ్యారేజీల నిర్మాణ సమయంలోనే లోపాలు తెలిసినప్పటికీ సరిదిద్దుకోలేదు. సుందిళ్ల, అన్నారం దగ్గర సాయిల్ టెస్ట్ చేయలేదు. ప్రారంభానికి ముందే లోపాలు బయటపడ్డాయి.. కానీ, బీఆర్ఎస్ ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర నష్టం జరిగింది. కాళేశ్వరం డిజైన్లు ఒకలా ఉంటే.. మరోలా నిర్మాణం చేశారు. ప్రాజెక్టు కోసం 85 వేల కోట్లు అంచనా వేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం లోన్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలింది. ఎన్‌డిఎస్‌ఏ మేడిగడ్డ పరిశీలనకు వచ్చింది గత ప్రభుత్వం పాలనలోనే. మేడిగడ్డ లో డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఎన్‌డిఎస్‌ఏ రిపోర్ట్ గత ప్రభుత్వ హయంలోనే ఇచ్చారు. ఎన్‌డిఎస్‌ఏ అథారిటీ బిల్లుకు పార్లమెంట్‌లో బిఆర్‌ఎస్ మద్దతు పలికింది. దేశంలో 5600 బ్యారేజీలు, డ్యామ్‌లను ఎన్‌డీఎస్‌ఏ పర్యవేక్షిస్తోంది. దేశంలో ఏ బ్యారేజీకి ఎలాంటి సమస్య వచ్చినా ఎన్‌డిఎస్‌ఏ నుంచే అభిప్రాయం చెప్తుంది. ఎన్‌డిఎస్‌ఏ లో జాతీయ అంతర్జాతీయ నిపుణులు ఉన్నారు. అలాంటిది ఎన్‌డిఎస్‌ఏనిపుణులను సైతం బిఆర్‌ఎస్ నాయకులు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్రంపై లక్షన్నర కోట్ల భారం పడుతోంది. ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులకు మిత్తి ఏడాదికి 16వేలు కట్టాల్సి వస్తోంది. మేం అధికారంలోకి వచ్చాక మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌కు లేఖ చేశాం. 14 నెలలు పరిశీలించి నివేదిక రూపొందించింది. గత ప్రభుత్వ కక్కుర్తి వల్ల చాలా నష్టం జరిగింది తుమ్మెడిహట్టి దగ్గర రెండు ప్రాజెక్టులు కడతామన్నారు. తట్టెడు మట్టి కూడా పోయలేదు. పైగా అక్కడ నీటి లభ్యత లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు.. లొకేషన్ పెద్ద మిస్టేక్. అది కూలినప్పుడు కేసీఆర్ సీఎంగా ఉన్నారు. వాల్స్, భీమ్స్‌లో రంధ్రాలు వచ్చాయని ఎన్‌డీఎస్‌ఏ పేర్కొంది. ఇంతకన్నా సిగ్గు చేటు ఉంటుందా?. సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి.. అనవసర మాటలు మాట్లాడుతున్నారు అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. కాళేశ్వరాన్ని ఉపయోగించుకునే స్థితి లేదని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. రీడిజైన్ చేసి నిర్మాణం చేయాలని చెప్పింది. రిపోర్ట్ ఆధారంగానే ముందుకు వెళ్తాం ప్రాజెక్టు తప్పిదాలకు కారణమైన అధికారుల పై చట్టప్రకారం చర్యలు ఉంటాయి. అధికారులు తప్పిదాలు చేయడానికి కారణమైన వ్యక్తి గత ప్రభుత్వ పెద్ద కేసీఆర్ . చట్టప్రకారం గత ప్రభుత్వ పాలకులు, అధికారులపై చర్యలు ఉంటాయి. రాబోయే కేబినెట్ భేటీలో %చీఱూూ% రిపోర్ట్ పై చర్చ జరుపుతాం. క్యాబినేట్ లో చర్చించిన తర్వాత ప్రాజెక్టు పై తదుపరి కార్యాచరణ ప్రకటన చేస్తాం.

# మిస్ వరల్డ్ పోటీలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మొదటి పేజి తరువాయి



మే 10వ తేదీ నుంచి మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో, పోటీల్లో పాల్గొనేవారికి, హాజరయ్యే దేశ, విదేశీ అతిథులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వారి బస, ప్రయాణం వంటి విషయాల్లో లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం కావడంతో భద్రతాపరమైన అంశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా విమానాశ్రయం, అతిథులు బస చేసే హొటళ్లు, వారు సందర్శించే అవకాశం ఉన్న చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగరానికి వచ్చే అతిథులు హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా అనువైన ఏర్పాట్లు చేయాలని కూడా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోటీల ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నందున, నగర సుందరీకరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# పద్మభూషణ్ అవార్డును అందుకోవడంపై బాలకృష్ణ స్పందన



అమరావతి: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీలో నిన్న జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా హాజరైన బాలకృష్ణ, అవార్డు స్వీకరణ అనంతరం మీడియాతో తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ పురస్కారం అందుకోవడం పట్ల బాలకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. తన అభిమానులకు, భారత ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవార్డు ఎప్పుడో రావాల్సిందని కొందరు అభిమానులు అభిప్రాయపడుతుంటారని, అయితే తనకు సరైన సమయంలోనే పద్మభూషణ్ వచ్చిందని తాను భావిస్తున్నట్లు బాలకృష్ణ పేర్కొన్నారు. "వరుసగా నేను నటించిన నాలుగు సినిమాలు ఘన విజయం సాధించడం, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభించి 15 సంవత్సరాలు పూర్తి కావడం, ముఖ్యంగా నేను సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన ఈ తరుణంలో ఈ పురస్కారం రావడం నాకు ఎంతో ప్రత్యేకం" అని ఆయన వివరించారు.

# ఉగ్రదాడి నేపథ్యంలో మోదీకి రాహుల్ గాంధీ లేఖ

మొదటి పేజి తరువాయి



పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు తమ లేఖలో ప్రధానిని కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం యావత్తూ ఐక్యంగా నిలుస్తుందనే బలమైన సందేశాన్ని ప్రపంచానికి అందించాల్సిన అవసరం ఉందని రాహుల్, ఖర్గే తమ లేఖలో నొక్కి చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి సభ నివాళులర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలపై పార్లమెంట్ వేదికగా సమగ్రంగా చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, పహల్గామ్ దాడి జరిగిన వెంటనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై, ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడంతో పాటు, తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అయితే, ఆ కీలక సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే అప్పట్లోనే తప్పుబట్టారు. ప్రధాని స్వయంగా హాజరై పరిస్థితిని వివరిస్తే బాగుండేదని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇప్పుడు మరోసారి పార్లమెంట్ సమావేశాల ఆవశ్యకతను గుర్తుచేస్తూ రాహుల్ గాంధీతో కలిసి ప్రధానికి లేఖ రాశారు. వీరితో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు కూడా ఇదే తరహా డిమాండ్లు చేశారు. టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ ఈ దాడి ఘటన భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపుతోందని, దీనిపై ప్రధాని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ సైతం ప్రధానికి లేఖ రాస్తూ, ఉగ్రవాదంపై దేశం ఐక్యంగా ఉందని చాటేందుకు పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

# కెనడా ఎన్నికల్లో భారత్ అనుకూల మార్క్ కార్నీ

ఢిల్లీ: కెనడా ఎన్నికల్లో లిబరల్స్ పార్టీ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. దీంతో మార్క్ కార్నీ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మార్క్ కార్నీ భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నట్లు గతంలో పలుమార్లు వెల్లడించారు. లిబరల్ పార్టీ ఘన విజయం నేపథ్యంలో మార్క్ కార్నీకి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరు దేశాల మధ్య ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన పట్ల ఉన్న నిబద్ధతను ప్రస్తావిస్తూ, కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు కలిసి పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. గత ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో భారత్‌-కెనడా మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా, ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో కెనడా ప్రభుత్వం భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇరు దేశాలు దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకునే వరకు వెళ్లింది. అనంతరం ట్రూడో సొంత పార్టీలోనే వ్యతిరేకత రావడంతో ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో మార్క్ కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడానికి, విభేదాలను పరిష్కరించడానికి కృషి చేస్తామని కార్నీ గతంలోనే సంకేతాలు ఇచ్చారు. భారత్‌తో కెనడియన్లకు వ్యక్తిగత, ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తించారు. న్యూఢిల్లీతో దౌత్య, వాణిజ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టడానికి చర్యలు తీసుకుంటామని కార్నీ హామీ ఇవ్వడం ఇరు దేశాల మధ్య సహకారానికి, ముఖ్యంగా వాణిజ్య బలోపేతానికి, కెనడాలో విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థులకు సానుకూల పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. కార్నీ నాయకత్వంలో భారత్‌-కెనడా ద్వైపాక్షిక బంధం తిరిగి బలపడుతుందని ఆశిస్తున్నారు.

# ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ ను ఏకిపారేసిన భారత్

ఢిల్లీ: ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఉగ్రవాదులకు తమ దేశం మద్దతు ఇవ్వడమే కాకుండా, వారికి శిక్షణ కూడా ఇస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా అంగీకరించిన విషయాన్ని భారత్ ప్రముఖంగా ప్రస్తావించింది. పాకిస్థాన్ ఈ అంతర్జాతీయ వేదికను దుర్వినియోగం చేస్తూ, భారత్‌పై నిరాధార ప్రచారానికి పాల్పడుతోందని మండిపడింది. భారత డిప్యూటీ పర్మినెంట్ రెప్రజెంటేటివ్ యోజన పటేల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ తీరును తీవ్రంగా ఖండించారు. "ఒక నిర్దిష్ట ప్రతినిధి బృందం ఈ వేదికను దుర్వినియోగం చేయడం, దాని ప్రాముఖ్యతను తగ్గించడం దురదృష్టకరం. భారత్‌పై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రచారంలో మునిగి తేలుతున్నారు. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ఓ టెలివిజన్ ఇంటర్వ్యూలో పాక్ ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం, శిక్షణ, నిధులు సమకూర్చడం వంటి చరిత్రను అంగీకరించిన విషయాన్ని ప్రపంచమంతా విన్నది" అని యోజన పటేల్ గుర్తు చేశారు. "ఈ బహిరంగ ఒప్పుకోలు ఎవరినీ ఆశ్చర్యపరచదు. ఇది ప్రపంచ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ప్రాంతాన్ని అస్థిరపరుస్తున్న పాకిస్థాన్‌ను ఒక బాధ్యతారహిత రాజ్యంగా బయటపెడుతోంది. ప్రపంచం ఇకనైనా దీన్ని చూసీచూడనట్లు వదిలేయకూడదు" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా నాయకులు, ప్రభుత్వాలు అందించిన బలమైన, నిస్సందేహమైన మద్దతుకు, సంఘీభావానికి భారత్ కృతజ్ఞతలు తెలుపుతోందని ఆమె చెప్పారు. ఉగ్రవాదం పట్ల అంతర్జాతీయ సమాజం జీరో టాలరెన్స్‌తో ఉందని చెప్పడానికి ఈ మద్దతే నిదర్శనమని అన్నారు. 2008 నాటి ముంబై దాడుల తర్వాత పౌరులు అత్యధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోయింది పహల్గామ్ దాడిలోనేనని ఆమె గుర్తు చేశారు. "ఐరాస భద్రతా మండలి తన ప్రకటనలో చెప్పినట్లుగా, ఇలాంటి నీచమైన ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని, వాటిని నిర్వహించిన వారిని, నిధులు సమకూర్చిన వారిని, స్పాన్సర్ చేసిన వారిని కచ్చితంగా బాధ్యులను చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాలి" అని యోజన పటేల్ స్పష్టం చేశారు.

# అలా మాట్లాడితే... పాకిస్థాన్‌కే వెళ్లిపోండి డిప్యూటీ సీఎం పవన్

అమరావతి: పహల్గామ్ ఉగ్రవాద ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మత ప్రాతిపదిక 26 మందిని చంపినా పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్నారు. అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలని జనసేనాని అన్నారు. ఈ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఈరోజు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో జనసేన పార్టీ నివాళుల కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలని అన్నారు. ఇలాంటి విషయాలపై ఓట్లు, సీట్ల కోసం మాట్లాడకూడదని తెలిపారు. ఉగ్రఘటనలో జనసేన ఓ కార్యకర్తను కోల్పోయిందని పవన్ గుర్తుచేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు ఫ్యామిలీకి పార్టీ తరఫున రూ.50లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. "చనిపోయిన మధుసూదన్‌రావు ఎవరికి హాని చేశారు. కుటుంబాన్ని తీసుకుని కశ్మీర్‌కు వెళ్తే చంపేశారు. కశ్మీర్ మనది కాబట్టే అక్కడికి వెళ్లామని మధు భార్య చెప్పారు. హిందువులకు ఉన్న దేశం ఇదొక్కటే. ఇక్కడ కూడా ఉండొద్దంటే ఎక్కడికి పోవాలి. మత కలహాలు సృష్టించేవారి పట్ల అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి" అని పవన్ కల్యాణ్ అన్నారు.

# ఏపీ మెగా డీఎస్సీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థుల విషయంలో కీలక నిర్ణయం

అమరావతి: ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 20 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. ఈ క్రమంలో తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా కేటగిరీలకు చెందిన అభ్యర్థులు డిగ్రీలో 40 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. బీఈడీకి, టెట్‌కు డిగ్రీలో 40 శాతం మార్కుల అర్హత ఉండగా... డీఎస్సీకి మాత్రం 45 శాతం పెట్టడం పట్ల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి అభ్యర్థన మేరకు డిగ్రీలో 40 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక, జనరల్ అభ్యర్థులకు మాత్రం డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ప్రభుత్వం తేల్చి చెప్పింది. కాగా, ఏపీ డీఎస్సీ-2025కి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in/లో పొందుపరిచారు. ఏప్రిల్ 20 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల చెల్లింపు మే 15 వరకు కొనసాగనుంది. అలాగే మే 30 నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే డీఎస్సీ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది.

# స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్

హైదరాబాద్: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ట్వీట్లు పలు వివాదాలకు దారి తీసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ క్రమంలో ఆమె మరో సంచలన ట్వీట్ చేశారు. తనపై వేటు తర్వాత ఎక్స్ వేదికగా ఆమె స్పందిస్తూ.. భగవద్గీతలోని అంశాన్ని తన బదిలీకి అన్వయిస్తూ ట్వీట్ చేశారు. కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన. 4 నెలలు టూరిజం అభివృద్ధి కోసం నా వంతు కృషి చేశాను. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న టూరిజం పాలసీ 25-30లో రాష్ట్రానికి పరిచయం చేశాను" అని ట్వీట్ చేశారు. "నిర్లక్ష్యానికి గురైన టూరిస్ట్ సర్క్యూట్‌లలో దిశ, పెట్టుబడి కోసం పటిష్టమైన ఫ్రేమ్‌ని సృష్టించాను. డిపార్ట్‌మెంట్ పని శైలిని పునరుద్ధరించాను. జవాబుదారీతనం నింపడానికి ప్రయత్నించాను. లాజిస్టిక్స్, ప్లానింగ్ కోసం పునాది వేసి- గ్లోబల్ ఈవెంట్ కోసం ప్రయత్నం మొదలు పెట్టాను.. అది నాకు ఆనందం.. గౌరవంగా ఉంది"అంటూ స్మితా ట్వీట్ చేశారు. కాగా, కంచ గచ్చిబౌలి భూవివాదంలో స్మితా సబర్మాల్.. ఏఐ ఫోటో రిట్వీట్ చేసిందని పోలీసులు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఆమె.. రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు చేయడం వివాదాస్పదంగా మారిన క్రమంలో తెలంగాణ ప్రభుత్వం.. స్మితాపై బదిలీ వేటు వేసింది. ఆమెను ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది.

# నేడు విజయవాడకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి



నేడు ఉదయం 9.15 గంటలకు రేవంత్ రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు విజయవాడ సమీపంలోని కానూరులో ఉన్న ధనేకుల ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఉదయం 10.50 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే వివాహ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం విజయవాడ నుంచి తిరుగుపయనమవుతారు. మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ చేరుకుంటారు. గత వారం దేవినేని ఉమా హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డిని కలిసి, తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. పెళ్లికి తప్పకుండా హాజరు కావాలని ఆయన సీఎంను ఆహ్వానించారు. గతంలో రేవంత్ రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు దేవినేని ఉమాతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. పార్టీలు మారినప్పటికీ వారి మధ్య స్నేహ బంధం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మిత్రుడి ఆహ్వానం మేరకు రేవంత్ రెడ్డి ఈ వివాహానికి హాజరవుతున్నారు. మరోవైపు, ఈ వివాహ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా హాజరవనున్నారు. ఈ క్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై కలుసుకునే అవకాశం ఉంది.

## జిజిహెచ్ గుంటూరు నందు
## అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు.



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అధ్భుతమైన కుట్టుకోతా లేని అడ్వాన్సుడ్ లేపరోస్కోపు ఆపరేషన్ 16 సంవత్సరాల స్టెరాయిడ్ మందులకు , కామెర్లకు, రక్తహీనతకు తెరదించిన జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డా?వై.కిరణ్ కుమార్ బృందంబందర్ కి చెందిన 44 సంవత్సరాల గల నాంచారమ్మ 16 సంవత్సరాల క్రితం మొదట కామెర్లు రావడం తో బందర్ లో నే ప్రైవేట్ హాస్పిటల్ లో చూపించుకొన్నారు,అక్కడ డాక్టర్లు పరీక్షించి బయట హాస్పిటల్ కి పంపించారు.పదిలక్షల ఖరీదైన అడ్వాన్సుడ్ లేపరోస్కోపు ఆపరేషన్ యన్ టి ఆర్ వైద్యసేవ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండ అన్ని పరీక్షలు అయ్యేలా అందించి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ఇటు వంటి అరుదైన ఆపరేషన్లను ప్రభుత్వ హాస్పిటల్ లో బటన్ హెూల్ ద్వారా విజయవంతం చేయటానికి ఖరీదైన వ్యాస్కులార్ ఎండో స్టాప్లర్ మరియు వ్యాక్సీన్లు సమయానికి అందుబాటులో కి తెచ్చిన సూపరింటెండెంట్.

## రాష్ట్ర ప్రభుత్వం
## గిరిజన ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలి
### లేదంటే మే2న బంద్ నిర్వహిస్తాం
### సమావేశంలో గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు ప్రకటన



రాజవొమ్మంగి, ఏప్రిల్ 30 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలంలోని ముంజవరం గ్రామంలో మంగళవారం గిరిజన ఆదివాసీ జేఏసీ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డి ఎస్ సి నోటిఫికేషన్ ప్రకటనలో 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీరని నష్టానికి గురవుతున్నారని వాపోయారు.రాష్ట్ర స్థాయి ఆదివాసీ సంఘాల ఐక్యతతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో జిఓ 3 బదులు నూటికి నూరు శాతం ఆదివాసీ నిరుద్యోగ యువతతో ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి మాట తప్పడంతో రాష్ట్ర ప్రభుత్వనికి ఈ నెల 30వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మార్పు చేసి ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఆదివాసీ ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో మే 2న రాష్ట్రంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతం మొత్తం బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వంలో మార్పు లేకపోతే మే 2 వతేదీ బంద్ జయప్రదం చేయుటకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చదువుకున్న యువతీ యువకులు,ఆదివాసీ మేధావులు ,ప్రజాసంఘాలు ,రైతులు,మహిళాలు,ప్రజా ప్రతి నిధులు తదితరులందరూ ఖచ్చితంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ యువతకు మంచి భవిష్యత్ కల్పనకు కృషి చేద్దామని ఈ సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ,తాము సూరిబాబు,గంప నాగరాజు,ఇపూరి వెంకటరమణ,ఈక గాంధీ,బీరబోయిన రామకృష్ణ,గుమ్మడి ప్రసాద్,ఈక చిన్న నాగరాజు, కొనకం భీమరాజు,నాని,కాకర రామలక్ష్మి,లక్ష్మి,కొనకం వరలక్ష్మి,బాణం అప్పలకొండ, లోత పాపాయమ్మ,లోతా చిన్ని,తదితరులు పాల్గొన్నారు.

## 139వ. మే డే సందర్భంగా ఊరు వాడ కంపెనీ కారా?
## నా ప్రతి అడ్డాలో ఎర్రజెండాలు ఎగరవేయండి..!
### ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపు..!



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 139వ. మే డే 1 ఒకటో తేదీన ఊరు, వాడ కంపెనీ, కారా?నా, ప్రతి అడ్డాలో ఎర్రజెండాలు ఎగరవేసి చికాగో అమరవీరుల వారోత్సవాలు ఘనంగా జరపాలని, పెద్దపల్లి జిల్లా ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ఉద్యోగ కార్మిక శ్రామిక జనావళికి పిలుపునిచ్చారు.1886లో పని గంటల తగ్గింపుకై జరిగిన వీరోచిత పోరాటంలో తుపాకి తూటాలకు బలి అయిన చికాగో అమరుల రక్తంలో ముంచి ఎత్తిన జెండా ఎర్ర జెండా అని అన్నారు.ఆనాడు బ్రిటిష్ తెల్లదొరల ను ఎదిరించి పోరాడి ప్రాణ తర్పణ చేసి సాధించుకున్న చట్టాలు హక్కులు నేడు కాలరాచి, వేయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాధించుకున్న కార్మిక హక్కులు చట్టాలు ఉద్యోగ భద్రత ఉపాధి హక్కుల సాధన అమలుకై మేడే సందర్భంగా ప్రతిన భూనాల్సిన అవసరం ఉందని కడారి సునీల్ అన్నారు.పెద్దపల్లి జిల్లాలో సింగరేణి బొగ్గు గనులు, ఎన్టిపిసి, ఆర్ ఎఫ్ సి ఎల్, బసంత్ నగర్ ఆసుపత్రులు ఆర్టీసీ సింగరేణి కాంట్రాక్ట్ ఆల్ సెంటర్స్,ఐకెపి సెంటర్స్ మార్కెట్లు గోదాములు రైస్ మిల్లులు ప్రతి అడ్డ కాడ సెంటర్లో ఎర్రజెండా ఎగురవేసి అమరులకు నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు.

## వావిలపల్లి ప్రసాద్ లెవెన్స్ పై
## ఘనవిజయం సాధించిన సనపల వరప్రసాద్ లెవెన్స్



మాధవధార ( జనం రిపోర్టర్ ) : మే డే పురస్కరించుకొని మాధవధారలో ఉన్నటువంటి సీనియర్ వెటరన్స్ క్రికెట్ క్రీడాకారుల యొక్క క్రికెట్ పోటీలు మంగళవారం జింక్ గ్రౌండ్లో నిర్వహించారు. ఈ పోటీలలో వావిలపల్లి ప్రసాద్ లెవెన్స్ మరియు సనపల వరప్రసాద్ లెవెన్స్ మధ్య ఉత్కంఠ భరితంగా క్రికెట్



మ్యాచ్ జరిగింది. ఈ పోటీలలో వావిలపల్లి ప్రసాద్ లెవెన్స్ పై సనపల వరప్రసాద్ లెవెన్స్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలు వయసు పైబడినటువంటి మాధవధార గ్రామస్తులు ఈరోజు క్రీడా పోటీలలో పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందని, ఇందులో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉత్కంఠ జరిగే పోటీ నెలకొందని అయితే గెలుపు, ఓటములు పక్కన పెడితే 50 సంవత్సరాలు వయసు పైబడినప్పటికీ యువతకు ఉండే జోరుతో ఈరోజు ప్రతి ఒక్కరూ తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారని, ప్రతిరోజు వ్యాయామం తేడా పోటీలలో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా సనపల వరప్రసాద్ లెవెన్స్ ను పలువురు అభినందించారు.

## పూర్తిస్థాయిలో పరిశీలించి సహకరించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్, సింగ్ కి , పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కి కృతజ్ఞతలు....
### -బొంకూరి మధు....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. మురుమూరు గ్రామంలో గ్రామ సభ సమావేశ అనంతరం, మాజీ ఎంపీపీ ఉరుమెట్ల రాజలింగం ని, వారి సతీమణి నీ, అంతర్గాం తహసిల్దార్ టి రవీందర్ ఎస్సీ మాల కులం పేరుతో, అవమానించారు.ఈ విషయంలో, రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ కి, పెద్దపల్లి,కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష కి, ఉరుమెట్ల రాజలింగం వారి సతీమణి వ్యక్తిగతంగా, ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య , అంతర్గాం మండల అధ్యక్షులు జిల్లా కో కన్వీనర్ ఇంటి బిల్లి రవీంద్ర కుమార్ దళిత సంఘాల నాయకులతో కలిసి తహసీల్దారుపై ఫిర్యాదు చేయడం జరిగింది. వారిపై విచారణ జరిపి తక్షణమే అరెస్టు చేయాలని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని కోరడం జరిగింది. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ మెయిల్ ద్వారా జరిగిన సంఘటనను ఫిర్యాదు చేయడం జరిగింది. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చేసిన ఫిర్యాదు మేరకు, రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ , జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పందించారు. అంతర్గాం మండలానికి బి యాకన్న ని ఇన్చార్జి తహసిల్దారుగా నియమించడం పట్ల ఎమ్మెల్యే కి, జిల్లా కలెక్టర్కి కృతజ్ఞతలు తెలుపుతున్నాము అని అన్నారు. తహసిల్దార్ రవీందర్ ని తక్షణమే సస్పెండ్ చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు అయిన తరుణంలో వారిని తక్షణమే అరెస్టు చేయాలని, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కలెక్టర్ కి జిల్లా పోలీస్ యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం దళిత సంఘాల నాయకులను ఇతర పార్టీల నాయకులను కలుపుకొని చేసిన ఫిర్యాదు విజ్ఞప్తి మేరకు అంతర్గామకు ఇన్చార్జి తహసిల్దారుగా బి బి యాకన్న ని నియమించడం పట్ల జిల్లా కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని యాకన్న కి శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము అని తెలిపారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పిలుపుమేరకు కలిసివచ్చిన దళిత సంఘాల నాయకులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.అంతర్గామ మండలం ములుగు లో జరిగిన సంఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ దృష్టికి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే తహసీల్దారును ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేయించవలసిందిగా కోరడం జరుగింది.

## రిజిస్ట్రేషన్ తప్పనిసరి వ్యవసాయ శాఖ -

బుక్కరాయసముద్రం మండలం ( జనం రిపోర్టర్ ) : మండల కేంద్ర పరిధిలోని లోని రైతులందరూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏపిఎఫ్ఆర్) తప్పనిసరిగా చేసుకోవాలని, ప్రతి రైతు 11 అంకెల రిజిస్ట్రేషన్ నెంబర్ కోసం మీ వివరాలు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయుంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు.ఇప్పటి వరకు మండలం లో 5767 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి అయిందని, ఇంకా 4766 మంది ఇంకా చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు పథకాల లబ్ధి పొందటానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరని, ముఖ్యంగా పి ఎం కిసాన్ డబ్బులు రైతు ఖాతాలోకి జమ కావాలంటే ఈ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే జాయింట్ ఎల్ పి లు కూడా ప్రస్తుతం రిజిస్టర్ అవుతున్నాయని కనుక జాయింట్ ఎల్ పి ఉన్న రైతులు కూడా రైతు సేవ కేంద్రాలలోని వ్యవసాయ మరియు ఉద్యాన సిబ్బంది ని సంప్రదించి ఏపిఎఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

## సీయం ఆర్ యఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



శింగనమల ( జనం రిపోర్టర్ ) : నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంగళవారం తమ క్యాంపు కార్యాలయంలో రూ. 21,71,375 రూపాయల సియంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ నిధులతో పేదలను ఆదుకుంటున్నాడని, అలాగే కూటమి ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెక్కులను అందుకున్న పేదలందరూ ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి వ్యతిరేకంగా బంద్...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. పెద్దపల్లి జిల్లాపహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి వ్యతిరేకంగా పెద్దపల్లిలో బంద్ నిర్వహిస్తున్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ బంద్కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఒక్క షాపు కూడా తెరచుకోక పోవడంతో వీధులన్నీ బోసిపోయి కనిపిస్తున్నా యి. పెద్దపల్లి కూరగాయల మార్కెట్ జెండా చౌరస్తా కామన్ రోడ్లో బంద్ సంపూర్ణంగా జరుగింది.పెహల్గామ్ ఉగ్రదాడితో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. కశ్మీర్ లోయలో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఉగ్రవాదుల కోసం ఐదు రోజులుగా వేట కొనసాగిస్తోంది. ఈ నేప థ్యంలోనే కశ్మీర్ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. కశ్మీర్లోని పలు పర్యాటక ప్రాంతాలను మూసివేసింది.పెహల్గామ్ ఉగ్రదాడిపై ఆగ్రహంతో ఉన్న సైన్యం.. కశ్మీర్లోని ఉగ్రవాదుల ఇళ్లను ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు ప్రతీకారంతో రగిలి పోతున్న ముష్కరులు.. పెద్ద ఎత్తున దాడులు, హత్యలకు ప్లాన్ చేస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు వస్తున్నాయి. కశ్మీర్ లోయలో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా సంస్థల హెచ్చరికలతో అప్రమత్తమైన ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కశ్మీర్లో మొత్తం 87 పర్యాటక ప్రాంతాలుండగా.. అందులో 48 ప్రాంతాలను మూసివేసింది. ఆ ప్రాంతా ల్లో సాయుధ బలగాలతో భద్రత కల్పించిన తర్వాతే వాటిని తిరిగి ఓపెన్ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టూరిస్ట్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## చుక్కలు చూపిస్తోన్న యాప్ - అంగన్వాడీల్లో తప్పని తిప్పలు..



పొన్నూరు ఏప్రిల్ 29 .జనం రిపోర్టర్:లిలియాప్ లు సక్రమంగా పనిచేయక సరుకుల పంపిణీకి ఇబ్బందులు.. లిలిఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నా పూర్తి కాని పంపిణీ..అంగన్వాడీ సెంటర్లలో పోషకాహార పంపిణీకి తిప్పలు తప్పడం లేదు. ప్రతి నెలా మొదటి శుక్రవారానికి పోషకాహార పంపిణీ పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం ఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నా ఇంకా 84.6% మాత్రమే పంపిణీ జరిగింది. కేంద్ర ప్రభుత్వం పారదర్శకత కోసం ముఖ ఆధారిత ధ్రువీకరణ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే సరకులు అందించే సమయంలో ఈ యాప్ సక్రమంగా పనిచేయక పోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నట్ సరిగా రావడంలేదు. దీని కారణంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు పలుమార్లు అంగన్వాడీ సెంటర్లకు రావాల్సి వస్తోంది.గర్భిణులు అంగన్వాడీ సెంటర్?లో తమ పేర్లను తప్పక నమోదు చేసుకోవాలి. వారి వివరాలను సిబ్బంది బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ (%ఖూూనాూచీ ు=ూజఖజు=ూూూ%), మిల్క్ యాప్లలో నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా వారికి పోషకాహార కిట్లు అందిస్తారు. ప్రతి నెలా 15లోగా నమోదైన లబ్ధిదారులకు మాత్రమే తర్వాత నెల పోషకాహార కిట్లను అందజేస్తారు. యాప్ సరిగ్గా పనిచేయకపోవడంతో 15వ తేదీ తర్వాత పేర్లు నమోదు చేస్తున్న వారికి పోషకాహారం అందడం లేదు.లిలిపంపిణీ ఇలా: బాలింతలకు ప్రతి నెలా 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, ఎండు ఖర్జూరం, చిక్కీలతో పాటు 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నూనె అరలీటరు పౌరసరఫరాల శాఖ నుంచి అందజేస్తున్నారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంకా 15.4 శాతం మంది లబ్ధిదారులకు కిట్లు ఇవ్వాల్సి ఉంది. వాటికోసం లబ్ధిదారులంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.లిలిపని చేయని ఫోన్?లు: లబ్ధిదారులకు ముఖ ఆధారిత అటెండెన్స్?తో సరకులు అందజేస్తారు. గత ప్రభుత్వం నాసిరకమైన ఫోన్?లను సిబ్బందికి అందజేసింది. ఇవి పనిచేయక కార్యకర్తలు తమ సొంత ఫోన్లలో యాప్లను ఇన్?స్టాల్ చేసుకున్నారు. దీనికి ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే 2%+దీ% డేటా సరిపోవడం లేదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. దీనివల్ల తమపై అదనపు భారం పడుతోందని అంగన్వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనం పై నుండి పడి ముగ్గురు మరణించిన సంఘటనపై బిల్డర్ నష్టపరిహారం చెల్లించాలి



పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : ఈరోజు తిరుపతి మంగళం సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం పై నుండి ప్రమాద వశాస్తు ముగ్గురు మరణించడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఐదంతస్తుల బిల్డింగ్ పై నుండి కిందపడి దుర్మరణం చెందటం అధికారుల నిర్లక్ష్య వైఖరి అని అన్నారు బాధ్యులైన అధికారులు మూడు స్టేర్లకే అనుమతినివ్వటం జరిగితే బిల్డర్ ఐదు స్టేయిర్లు బిల్డింగ్ కట్టడం జరుగుతూ ఉంటే చూచి చూడకుండా వదిలేయటం అత్యంత బాధాకరమన్నారు అయితే జిల్లా కలెక్టర్ బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టటం అభినందనీయం అయితే బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇప్పించి ఆదుకోవాలని , మూడు స్టేర్లకే ఆమోదం తీసుకున్న బిల్డర్ ఐదు స్టేర్లు నిర్మిస్తూ కార్మికులకు సరైన రక్షణ కవశాన్ని ఏర్పాటు చేయకుండా ముగ్గురి మరణానికి కారకుడైన బిల్డర్ పై చర్యలు చేపట్టడంతో పాటు బిల్డర్ నుండి బాధిత కుటుంబాలకు అదనంగా ఎక్స్గ్రేషియా ఇప్పించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈరోజు జరిగిన ఈ ఇన్సిడెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి కార్మికులను ఆదుకునేందుకు తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# వెంకటరావమ్మ బంగారు కుటుంబం- మార్గదర్శితో ముఖాముఖి కార్యక్రమం

: ముఖ్యమంత్రి హామీ నెరవేరిన వేళ

: బంగారు కుటుంబంలో ఆనంద హేళ

: ముప్పాళ్ల వేదికగా పీ4 కార్యాచరణలో తొలి అడుగు

,ఎన్టీఆర్ జిల్లా, నందిగామ, ఏప్రిల్ 29 ( జనం రిపోర్టర్ ) : : ఈ నెల 5న బాబు జగ్జీవన్రాం జయంతి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు ప్రతిరూపమైన పీ4 మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యరూపం దాల్చగా నేడు ముప్పాళ్లలో మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు సహాయం అందించడంతో ఆచరణలోకి వచ్చింది.పీ4 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ జిల్లా, నందిగామ నియోజకవర్గం, ముప్పాళ్ల గ్రామంలో పర్యటిస్తూ బంగారు కుటుంబం అయిన వెంకటరావమ్మ ఇంటికివెళ్లి వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించి, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెతలు విన్న ముఖ్యమంత్రి పీ4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, ఇంటిని మంజూరు చేస్తామని



అదేవిధంగా ఆటో, కుట్టు మిషన్ ఇప్పించడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించి పేదరికం నుంచి బయటపడే వరకు మార్గదర్శులు తోడుంటారని హామీ ఇచ్చారు. ఆ సమయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశను పిలిచి వెంటనే ఇళ్ల స్థలం, ఇంటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని, బంగారు కుటుంబానికి మార్గదర్శి తోడయ్యేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ప్రభుత్వ విప్



తంగిరాల సౌమ్య, స్థానిక ఆర్డీవో కె.బాలకృష్ణతో కలిసి మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు పత్రాన్ని, ఆటోను, కుట్టుమిషన్ను అందించేందుకు స్వయంగా కొండ్రు వెంకటరావమ్మ ఇంటికి వెళ్లారు. ఏమ్మా బాగున్నావా? కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారు? అంటూ వెంకటరావమ్మను యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, మీ ఇంటికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు మీరు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఏమేమి కావాలని అడిగారు? దీనికి వెంకటరావమ్మ స్పందిస్తూ మాది ఉమ్మడి కుటుంబం, అందరం కలిసి ఈ చిన్న రేకుల షెడ్డులో నివాసముంటూ ఇబ్బందులుపడుతున్నామని ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయమని, అదేవిధంగా కూలీనాలీ చేసుకొని బతుకుతున్న మాకు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ఆటో, కుట్టుమిషన్ ఇప్పించాలని కోరినట్లు వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మూడు సెంట్ల ఇంటి స్థల మంజూరు ధ్రువపత్రాన్ని ఇస్తున్నామని, త్వరలో ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మీ కుటుంబానికి మార్గదర్శి అయిన సెంటిని బయో ప్రొడక్ట్స్ యాజమాన్యం స్వయంగా ఇంటికొచ్చి మీకు ఆటోను, ప్లైవుడ్ కంపెనీ ద్వారా కుట్టుమిషన్ అందించారని, పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు వీరు మార్గం చూపుతారని తద్వారా కష్టపడి, ఆర్థికంగా నిలదొక్కుకొని మరొకరికి మీరు మార్గదర్శకులయ్యే స్థాయికి ఎదిగి ముఖ్యమమంత్రి ఆకాంక్షలను నెరవేర్చాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

వెంకటరావమ్మ నివాసం వద్ద కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పీ4 కార్యక్రమం మహాయజ్ఞం వంటిదని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఎంతో ముందుచూపు కలిగిన ముఖ్యమంత్రి పీ4 విధానాన్ని ప్రవేశపెట్టి బంగారు కుటుంబాలను ఎంపిక చేసి, మార్గదర్శుల సాయంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని, పేదరికం నుంచి బయటపడాలన్నదే లక్ష్యమన్నారు. పీ4 కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలో కార్యరూపం దాల్చడం, జిల్లా అధికారిగా గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలో 96 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, వీటికి మార్గదర్శులను తోడు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ నలుగురు మార్గదర్శుల స్ఫూర్తితో ముందడుగు వేసేందుకు మరింత మంది మార్గదర్శులు ముందుకు రావాలన్నారు. బంగారు కుటుంబాలకు, సహాయాన్ని స్వయంగా వారే అందించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషిచేయడం ద్వారా రాబోయే తరంలో వారి కుటుంబ సభ్యులకు ఒక మంచి కార్యక్రమాన్ని అందించామనే సంతృప్తి మార్గదర్శులకు మిగుల్చుతుందనే దాంట్లో ఎలాంటి సందేహం లేదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కొయ శ్రీ హర్ష.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29.పెద్దపల్లి, పెద్దపెల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వచ్చిన జస్టిస్ సునీతా కుంచాల ను మంగళవారం జిల్లా కోర్టు లో, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఆల్ ఇండియా వేతనాలు ఇతర చట్టబద్ధ హక్కులు సౌకర్యాలు అమలు చేయాలి....




రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు, ఇతర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ,మంగళవారం ఆర్జీ -1డివిజన్ జి ఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా హెచ్ ఎం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, టీ ఎస్ ఎం సి డబ్ల్యూ యు (టి ఎన్ టి యు సి) రాష్ట్ర నాయకులు కోటగిరి పాపయ్య లు... మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో వివిధ విభాగాలలో సుమారు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులు అవుట్సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేనంత పోతున్నారని,



చట్టబద్ధమైన హక్కులను సౌకర్యాలను అమలు చేయకుండా ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం వెంటనే పూనుకోవాల నీ డిమాండ్ చేశారు.జేబీసీసీఐ నిర్ణయించిన హై పవర్ కమిటీ వేతనాలను 2013 నుండి అమలు చేయాల్సి ఉండగా, సింగరేణి సంస్థ అమలు చేయడం లేదని కోలిండియా పరిధిలోని కొన్ని సంస్థలు జెపిసిసిఐ నిర్ణయించిన హై పవర్ కమిటీ వేతనాలను అమలు చేస్తున్నప్పటికీ లాభాలుగా నడుస్తున్న సింగరేణిలో కుంటి సాకులు చూపి అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారు దళిత గిరిజన మైనార్టీ నిరుపేద కాంట్రాక్టు కుటుంబాలు వారి శ్రమకు తగిన వేతనం లభించకపోవడంతో లక్షలాది రూపాయల కష్టార్జితం కోల్పోయి ఇబ్బందులను అనుభవిస్తున్నారనీ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అందుకు కూడా సింగరేణి యాజమాన్యం పూనుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడానికి పూనుకోలేదన్నారు.కనీసం ఈ మేడే సందర్భంగా నైనా సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలను, చట్టబద్ధమైన హక్కులను సౌకర్యాలను అమలు చేసేందుకు పూనుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సుద్దాల కుమారస్వామి, ఈ నరేష్, కొంద్ర మొగిలి, సంగం రాజు, చిటికెల రాయలింగు, గోనె సంతోష్, దెబ్బట సతీష్, ఈదునూరి రామకృష్ణ ,ఐ రాజేశం ,చింతల శేఖర్, శ్రీనివాస్, విజయ ,లక్ష్మి, నాగమ్మ, భూమమ్మ,పద్మ. తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ రథసారదుల నియామకం కె. ఎస్. ఎస్. నియామకాలో _ ప్రత్తిపాడు నియోజకవర్గ ఉమ్మడి జిల్లాల్లో మొదటి స్థానం



ఏలేశ్వరం, ( జనం రిపోర్టర్ ) : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, శాసనసభ్యురాలు. వరుపుల సత్య ప్రభ రాజా సూచనలతో ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లతో సమావేశం నిర్వహించిన నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు . ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన "కుటుంబ సాధికార సారథులు ( కె ఎస్ ఎస్ ) ల నియామకాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలోను, రాష్ట్రంలో 6 వ స్థానంలోను నిలిచిందని అన్నారు. అందుకు సహకరించిన నాయకులను అభినందిస్తున్నానని అన్నారు. అలాగే శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా నాయకత్వంలో బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల నియామకాల్లో మనమంతా చురుగ్గా పాల్గొందామని అన్నారు. ఈ సమావేశంలో ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి నరసింహామూర్తి (బుజ్జి)



ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు సూతి అప్పలరాజు (బూరయ్య) మాజీ జెడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకట్రావు, శంఖవరం మండల పార్టీ అధ్యక్షులు బద్ధి రామారావు, నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, క్లస్టర్ ఇంచార్జ్ లు బద్ది రమణ, సింహాద్రి పెదబాబు, పల్లా గోపి మరియు యూనిట్ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు ప్రభుత్వ సాధారణ వైద్యశాల జి జి హెచ్ ఆవరణలో రోటరీ క్లబ్ సెంటెనియల్ గ్లోసైన్ బోర్డ్స్ బహుకరణ







గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు వారు వితరణగా అందజేసిన గ్లో సైన్ బోర్డు ఏర్పాటు కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ బోర్డు విలువ ? 75,000ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ సెంటెనియల్ గుంటూరు అధ్యక్షులు పొనకాల బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగింది. క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ వీర రాఘవ, సంతోష్, కోట మురళీ కృష్ణ మరియు క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ వితరణను ప్రభుత్వ సాధారణ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ ప్రత్యేకంగా అభినందించారు.రోటరీ క్లబ్ సెంటెనియల్ గుంటూరు వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.సూపరింటెండెంట్ కార్యాలయం జి జి హెచ్

## ప్రభుత్వ భూములు గుర్తించే పనిలో అధికారులు యర్రవరంలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన ఆర్డిఓ కె.శ్రీ రమణి.



ఏలేశ్వరం, ( జనం రిపోర్టర్ ) : కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియను పెద్దాపురం ఆర్డీవో. కె శ్రీ రమణి పరిశీలించారు. మొత్తం 11 టీముల పని విధానాన్ని స్థానిక ఎమ్మార్వో ను అడిగి తెలుసుకున్నారు. విలేజ్ బౌండ్రి సరిహద్దులు, 11 బ్లాక్ ల సరిహద్దు పాయింట్ల వివరాలు పరిశీలించారు.సర్వే జరిగే ప్రదేశాలలో



ప్రభుత్వ భూములను గుర్తించే దిశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ పి ఓ ఎల్ ఆర్. ను పరిశీలించారు. రెవిన్యూ అధికారులు అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ రీ సర్వే పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎమ్మార్వో కుశరాజు, రీ సర్వే డిటి సంధ్య, ఆర్ ఐ పొన్నాలు, వీఆర్వోలు మణికంఠ, అప్పారావు, శ్రీను, సత్యరావు, రమణ, సర్వేయర్లు సత్యనారాయణ, దుర్గాప్రసాద్, తదితరరెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్.ఆర్.ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి




( జనం రిపోర్టర్ ) : ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ పర్యటనవైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్లోబల్ విస్తరణలో భాగంగా మరియు ప్రవాసాంధ్రుల మద్దతును మరింత బలోపేతం చేయడానికి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్.ఆర్.ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ శ్రీ ఆలూరు సాంబశివారెడ్డి ఏప్రిల్ 29 నుంచి మే 12, 2025 వరకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల పర్యటన చేయనున్నారు.ఈ పర్యటనలో పార్టీ మద్దతుదారులతో నిర్వహించే సమావేశాల షెడ్యూల్:మే 2 ,సిడ్నీమే 3 , మెల్బోర్న్మే 4 , బ్రిస్బేన్ మే 9 ఆక్లాండ్మే 10 సింగపూర్ఈ పర్యటన లక్ష్యం:ఎన్.ఆర్.ఐ విభాగాన్ని దేశాల వారీగా నిర్మించడం, ప్రవాస మద్దతుదారులను బలోపేతం చేయడం, మరియు 2029లో శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిగా తీసుకురావడంశ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో అభివృద్ధి మరియు ఆర్థిక పురోగతి (2019%-2024)%శ్రీ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టి గల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మరియు ఆర్థిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి:ఆర్థిక పురోగతి: రాష్ట్ర జీడీపీ వృద్ధి దేశ సగటు కంటే ఎక్కువగా నమోదైంది. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం.పరిశ్రమలు మరియు పెట్టుబడులు:గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ 2023లో ?13 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంలో విజయవంతం.మెగా ఇండస్ట్రియల్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటు.మౌలిక సదుపాయాల అభివృద్ధి:6 నూతన పోర్టులు, 4 నూతన ఎయిర్‌పోర్టులుఅనేక రహదారులు, బ్రిడ్జీలు అభివృద్ధి.త్వరితగతిన అభివృద్ధి చెందిన రవాణా మౌలిక సదుపాయాలునగరాభివృద్ధి మరియు గృహ నిర్మాణం: 30 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం. సమర్థవంతమైన పట్టణ ప్రణాళికాభివృద్ధి.విద్య మరియు మానవ వనరుల అభివృద్ధి:నాడు%-%నేడు ద్వారా 60,000 పాఠశాలల ఆధునీకరణ.స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలు మరియు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా మౌలిక వసతుల అభివృద్ధి.ఆరోగ్య రంగ అభివృద్ధి: 17 కొత్త మెడికల్ కాలేజీలు స్థాపన.గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మరియు పట్టణ ఆరోగ్య మౌలిక సదుపాయాల బలోపేతం.జాతీయ మరియు అంతర్జాతీయ గుర్తింపు:ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎస్ డి జి, లక్ష్యాల్లో ఆంధ్రప్రదేశ్ టాప్-3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది.ఈ సందర్భంగా శ్రీ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ, ప్రవాసాంధ్రుల మద్దతుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సాధించిన అభివృద్ధిని ప్రపంచానికి చాటిచెప్పి, ప్రజల సంకల్పంతో 2029లో శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ,ని మళ్లీ ముఖ్యమంత్రిగా తీసుకురావడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## పెద్దపల్లి కమాన్ ఎదురుగా రాజీవ్ రహదారిలో బైకును ఢీకొన్న లారీ, ఒకరికి తీవ్ర గాయాలు....




రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. పెద్దపల్లి పట్టణంలో కమాన్ ఎదురుగా గల రాజీవ్ రహదారి పై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పెద్దపల్లి మున్సిపల్ పారిశుద్ధ కార్మికుడు మల్లారపు కొమురయ్య అను వ్యక్తి ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా, గోదావరిఖని నుండి కరీంనగర్ వైపు వెళు _న్న లారీ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి బైకును ఢీకొనగా కొమురయ్య కాలు విరిగింది.కొమురయ్యను మొదలు పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ కూడా సరైన వైద్యం అందకపోవడంతో కరీంనగర్ లోని ప్రైవేటు హాస్పిటల్కు తరలించారు.లారీ నల్గొండలోని కోదాడకు చెందిందని బెల్లంపల్లి సమీపంలోని దేవపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో సిమెంటు లోడ్ తీసుకొని వరంగల్ కు వెళుతుందని, మంగళవారం ఉదయం బైకు ను ఢీ కొట్టి డివైడర్ నుకూడా ఢీ కొట్టిందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పెద్దపల్లి పోలీసులు తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 20 మంది ప్రత్యేక చిన్నారులకు ఉపకరణాలు అందజేత..










పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం భవిత కేంద్రంలో మంగళవారం పొన్నూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన 20 మంది చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా రోటరీ క్లబ్ గవర్నర్ (3150)కాట్రగడ్డ శరత్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సేవా దృక్పథంలో రోటరీ క్లబ్ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. రోటరీ సేవలు పొన్నూరు ప్రాంతంలో విస్తృత పరిచి మరి కొంతమంది పేదవారి కి సహాయం చేయడానికి ముందంజలో ఉందని పేర్కొన్నారు.రొటేరియన్ (షార్) బాలకోటి రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన వ్యక్తులు స్వేచ్ఛగా సులభంగా కదలగల సామర్థ్యం కలిగించుట కొరకు షార్ ప్రత్యేక వ్యక్తులకు వీల్ చైర్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు వీటిని సద్వినియోగ పరుచుకొని స్వేచ్ఛగా సులభంగా నడవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గూండా అశోక్ బాబు, కె ఎస్ కె ప్రసాద్, పొన్నూరు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొని రోటరీ సేవలను కొనియాడారు. 20 మంది చిన్నారులకు వీల్ చైర్స్ పంపిణీ చేయడం హర్షనీయమని వారు కొనియాడారు.రోటరీ క్లబ్ సేవలు పొన్నూరు మండలంలో మరింత విస్తృతపరచాలని రోటరీ సభ్యులను వారు కార్యక్రమంలో కోరారు. కార్యక్రమంలో పొన్నూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జె. వి. రాకేష్ దేవ్, అసిస్టెంట్ గవర్నర్ ఎం.పేరుమాళ్ల, సెక్రెటరీ నన్నపనేని బాలకృష్ణ పలువురు రోటరీ సభ్యుల తోపాటు ఫిజియోథెరపీ డాక్టర్ జి ప్రియదర్శినీ ,భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు బి. విజయ కుమారి,సిబ్బంది ,తల్లిదండ్రులు , చిన్నారులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలతోనే తెలుగుదేశం పార్టీ బలోపేతం. ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్



రాజవొమ్మంగి,రంపచోడవరం ఏప్రిల్ 29 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఎం శిరీషా దేవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రంపచోడవరం డివిజన్లో 7 మండలాలు,చింతూరు డివిజన్లో 4 మొత్తం 11 మండలాల్లో సమావేశానికి హాజరైన ముఖ్య నేతలు ప్రతి పంచాయతీలో నూతనంగా తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలను నియమించాలని ఆమె పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి ఐక్యతగా కృషి చేయాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్,మార్కెట్ కమిటీ



చైర్మన్ లోతా లక్ష్మణరావు,దంతులూరి శివాజీ,11 మండలాల అధ్యక్షులు,కార్యదర్శులు,సీనియర్ నాయకులు,క్లస్టర్స్,యూనిట్ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందు పాప పుట్టినరోజు సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



పొదిలి ( జనం రిపోర్టర్ ) : యానాం వాసులు శ్రీ శ్రీమంతుల శ్రీనివాస్ గారు, శ్రీమతి సుశీల రాణి గారు తమ ముద్దుల కుమార్తె ఇందు శ్రీ పుట్టినరోజు సందర్భంగా ఒక అభినందనీయం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి ఇందు శ్రీ పేరిట, దివ్యాంగుగ్ రక్షక్ ఫౌండేషన్ మరియు హోప్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పొదిలి చుట్టుపక్కల ప్రాంతాలలోని అవసరమైన వారికి మరియు నవ్యాంధ్ర దివ్యాంగుల వృద్ధాశ్రమంలో మంచి, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందజేశారు.ఈ కార్యక్రమం ద్వారా చిన్నారి పుట్టినరోజును కేవలం కుటుంబ పరంగా కాకుండా, సమాజానికి మేలు చేసే విధంగా జరపడం ఎంతో గొప్ప విశేషం. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంతో మేళవించడం ద్వారా, చిన్నారి ఇందు శ్రీ చిన్ననాటి నుండి మానవతా విలువలను గర్వంగా ఒంటరిగా మోసుకుంటోంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, మేము చిన్నారి ఇందు శ్రీకు ఆరోగ్యంగా, ఆనందంగా మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము. అలాగే, శ్రీనివాస్ గారూ, సుశీల రాణి గారూ ఎల్లప్పుడూ ఆనందంగా, ఆరోగ్యంగా చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా దీవిస్తున్నాము.

# అమరావతి పునర్నిర్మాణానికి వస్తున్న ప్రధాని సభకు ప్రజలు తరలిరావాలి



రేపల్లె., ( జనం రిపోర్టర్ ) : మే 2 వ తేదీన గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కానున్న సందర్భంగా తాడికొండ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసే బాధ్యతను అధిష్టానం నాకు అప్పగించింది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో మోదీ గారి సభకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్థానిక తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మరియు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు తో మరియు బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించాను. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, నా రాజధాని అమరావతి అనే నినాదంతో ప్రతి కుటుంబం నుంచి ఒకరు మోదీ సభకు విచ్చేసి అమరావతి రాజధాని పునర్నిర్మాణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ప్రజలకు తెలియజేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ ..

## "మానవత్వం గల చేతులు కలిస్తే ఆకలికి ఆపన్నహస్తం!"



పొదిలి ( జనం రిపోర్టర్ ) : ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ఎంతో గొప్పది. అలాంటి గొప్ప ప్రయత్నం అమ్మ దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతోందంటే, అందుకు ప్రేరణ ఇచ్చింది హెూప్స్ ఫౌండేషన్ అనే తేజోమయ సంస్థ. ఈ రోజు అమ్మ దీవెన ఫౌండేషన్ ప్రారంభించిన ఫుడ్ కలెక్షన్ కార్యక్రమానికి తమ మానవతా సహాయాన్ని అందిస్తూ, హెూప్స్ ఫౌండేషన్ మరోసారి ఆదర్శంగా నిలిచింది. ప్రతి రోజూ తమ వంతు భోజనాన్ని నిరంతరం అందజేస్తూ, "మన వంటింటి వాసన అనాధ కడుపులోకి చేరాలి" అన్న ధ్యేయంతో ముందుకు సాగుతోంది ఈ ఫౌండేషన్. పొదిలి పరిసర ప్రాంతాలలో నిరుపేదలు, నిరాశ్రయులు, అనాథలు ఎవరికైతే నిత్యాహారం కూడా ఆశగా మారిందో వారికి ఈరోజు కూడా పౌష్టిక ఆహారాన్ని అందజేసిన ఈ రెండు ఫౌండేషన్లకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సామాజిక బాధ్యతతో నిండిన స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ మానవత్వం పట్ల నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది. సహాయం చేయాలనే తపన ఉంటే మార్గాలు దొరుకుతాయి హెూప్స్ ఫౌండేషన్ వాటిలో మార్గదర్శకంగా నిలుస్తోంది.

## ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామస్థాయి నాయకులతో ఎం ఎస్ రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. రామగుండం నియోజకవర్గం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ పాలకుర్తి అంతర్గాం మండలాలకు చెందిన గ్రామ అధ్యక్షులతో గూగుల్ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ అదే విధంగా చూడాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రామాల్లో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజల సమస్యలు మొదలైన అంశాలపై ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామస్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడైన పేదవాడికి నివాస గృహం లభించాలి, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఒక్కరి కూడా మినహాయించకుండా, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి మంజూరు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం," అని స్పష్టం చేశారు. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామస్థాయికి చేరాలని, అందులో పాలకుర్తి మండలాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ మీటింగ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లులు,పసిపిల్లలకు గది ఏర్పాటు..



పొన్నూరు ఏప్రిల్ 29.జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో సోమవారం పొన్నూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లులు, పసిపిల్లలకు పాలివ్వడానికి నూతన గదిని రోటరీ గవర్నర్ కె.శరత్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరు రోటరీ క్లబ్ మహిళ ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేసిన తల్లులు ,పసిపిల్లలకు పాలివ్వడానికి గదిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పొన్నూరు రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అమోఘం అన్నారు. డిపో మేనేజర్ పి.అజిత కుమారి తోటి స్టాఫ్ అందరూ కలిసి స్టాఫ్ , ప్రయాణికుల సౌలభ్యం కోసం మంచినీటి సదుపాయనికి ఆర్ ఓ ప్లాంట్ కొరకు అర్జీ అందచేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు రోటరీ ప్రెసిడెంట్ డా జె రవి రాకేష్ దేవ్, సెక్రెటరీ బాలకృష్ణ, వీరయ్య, జి ఎం ఎస్ గుప్తా, బి వి చౌదరి, రాధాకృష్ణ, భానుప్రసాద్, రమేష్ ఇతర సభ్యులు ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ సరోజిని ఇతర సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దుర్గారాణి పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని జేసీ ఆధ్వర్యంలో జి ఎం పర్సనల్ కి వినతిపత్రం.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29.మంగళవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో... గోదావరిఖని జిఎం కార్యాలయంలో జిఎం పర్సనల్ కిరణ్ కుమార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఉల్లి మొగిలి, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె విశ్వనాథ్ ,టిసికెఎస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఎ ఐఎఫ్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి రత్నకుమార్ మాట్లాడుతూ, సింగరేణి సింగరేణి యాజమాన్యం కార్మిక చట్టాలు అమలు చేయడం లేదు. చట్టాల లో రూపొందించిన వాటిని అమలు చేయకుండా దోచుకుంటుంది. ఈనాడు సింగరేణి వస్తున్న లాభాలలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ దాగి ఉన్నది. ప్రభుత్వ అధికారి సింగరేణి సంస్థకు చైర్మన్ అయి ఉండి ప్రభుత్వం రూపొందించిన చట్టాలు సింగరేణిలో అమలు కాకపోవడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఏండ్ల తరపడి తమ జీవితాలను సింగరేణి సంస్థకు దాదా దత్తం చేసిన కాంట్రాక్టు కార్మికులకు గుండు సున్నా మిగులుతున్నది. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం సింగరేణిలో కార్మిక చట్టాల అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వేతనాలు పెంచుతూ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఇంకా ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రామస్వామి, దాముక లచ్చన్న, రవి, సమ్మయ్య, శంకర్, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

## డీసీఎంఎస్ చైర్మన్ గా వడ్రాణం హరిబాబు నాయుడు.



పొన్నూరు ఏప్రిల్ 29. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వడ్రాణం హరిబాబు కు గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పొన్నూరు మండలం వడ్డిముక్కల గ్రామంలో వడ్రాణం హరిబాబు కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నారు. దివంగత రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరితో వడ్రాణం హరిబాబు కుటుంబ సభ్యులు మొదటినుంచి కలిసి నడుస్తూనే ఉన్నారు. అదేవిధంగా వడ్రాణం హరిబాబు కూడా కుటుంబ సభ్యుల బాటలోనే తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సహకారంతో అంచలంచలుగా పార్టీలో ఎదిగారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, నరసరావుపేట పార్లమెంటు, గన్నవరం, గుడివాడ అసెంబ్లీ స్థానాల తెలుగుదేశం పార్టీ పరిశీలికుడుగా సమర్థవంతంగా వ్యవహరించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ల మన్ననలు పొందారు. దీంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా వడ్రాణం హరిబాబును నియమించింది. గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా నూతనంగా నియమితులైన వడ్రాణం హరిబాబును పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తో పాటు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు..

## వేదనలోనూ వీడని వితరణ, కుమారుని స్మృతిలో అన్నదానం చేసిన కుటుంబం....




రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. ఇటీవల రోడ్డు ప్రమాదంలో అసువులుబాసిన సిరిపురం వంశీ జయంతి సందర్భంగా, తల్లి తండ్రులు సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు మంగళవారం స్థానిక అమ్మ పరివార్ ఆశ్రమంలో అన్నదాన కార్యకమాన్ని నిర్వహించారు. వంశీ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆఫీస్ బాయ్, నిరుపేద యువకుడు సంపత్ కు వంశీ జ్ఞాపకార్థం కొత్త బట్టలు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రయోజకుడై చేతికి అంది వచ్చిన చెట్టంత కొడుకును ప్రమాదరూపంలో కోల్పోవడం మనసును కలచివేస్తోందని, ఆ పుట్టెడు దుఃఖంలోనూ సమాజహితం కోసం కుమారుడి జ్ఞాపకాల్లో నిరుపేదలకు అన్నదాన వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బుచ్చమ్మ, సూర్య, పద్మ, కుమారస్వామి, సరస్వతి, కార్తీక్, బిట్టు, సాన్యా, కళాకారులు కనకం రమణయ్య, మేజిక్ రాజా, మాదరి వాసు, సోగాల వెంకటి, కాశిపాక రాజమౌళి, బోడకుంట వెంకట్రాజం, చంద్రపాల్, అట్ల జగ్గయ్య, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే రోజున కామ్రేడ్ గంగిల్ల లింగారెడ్డి విగ్రహావిష్కరణ



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) : ఎల్లాపూర్ గ్రామంలో మే 1న ఉదయం 10 గంటలకు సిపిఐ సీనియర్ నాయకులు గంగిల్ల లింగారెడ్డి విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ఆవిష్కరించనున్నారని బికేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, హసన్ పర్తి మండలం సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం నాయకులు నేదునూరి రాజమౌళి తెలిపారు. మంగళవారం మండలంలోని అనంతసాగర్, మడిపల్లి, సుబ్బయ్య పల్లి, జయగిరి, మునిపల్లి, చింతగట్టు, ఎల్లాపూర్ గ్రామాలలో తిరిగి గంగిల్ల లింగారెడ్డి విగ్రహావిష్కరణ, వర్ధంతి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. అలాగే మే 26,27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో జరుగు జిల్లా సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని మడిపల్లి గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి జక్కుల సాంబరాజు నేతృత్వాన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు డి రాము, వెంకటేష్, సాంబరాజు, సమ్మయ్య, బుర్ర వెంకటేష్, బుర్ర చంద్రమౌళి, జక్కుల ఓదెల్, బుర్ర సుధాకర్, ముద్రవేణి రాజు, జక్కుల బన్నీ, జక్కుల అశోక్, ముంజ రంజిత్, అనిల్, జక్కుల రాజు, జక్కుల రాజ్ కుమార్, సమ్మయ్య, జంపాల రాము తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధులకు ఆటంకము కలిగించి, భయభ్రాంతులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలి....

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి....



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. జిల్లా వైద్య, మరియు ఆరోగ్య శాఖ అధికారి, పెద్దపల్లి విధులకు ఆటంకము కలిగించి, భయభ్రాంతులకు గురిచేసి, వారి పైన రిసిప్షనిస్ట్ ఆనంద్ చే కేసు నమోదు చేయించిన మమత హాస్పిటల్, గోదావరిఖని యజమాన్యం, సిబ్బంది తదితరులపై చర్యలు తీసుకోవాలి అని జిల్లా కలెక్టర్ కి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షులు బొంకూరి శంకర్, వైద్య ఉద్యోగులు రిప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేది. 26-ఏప్రిల్ -2025 శనివారం డా. జి. అన్నా ప్రసన్న కుమారి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, పెద్దపల్లి విధి నిర్వహణలో బాగంగా మమత హాస్పిటల్, గోదావరిఖనిని తనిఖీ చేయగా అందులో అనుమతి లేని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ను గుర్తించడం జరిగినది. చట్ట ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ కలిగి ఉండడం నేరము, తన విధి ప్రకారం చర్యలు తీసుకొనుచుండగా దానికి అడ్డుపడి, నానా విధాలుగా బెదిరించి, ఐ ఎం ఎ డాక్టర్లు, ఇతర వ్యక్తులను పిలిపించి విధులకు ఆటంకము కలిగించి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పై దౌర్జన్యము చేసి, భయభ్రాంతులకు గురి చేయడమైనది, చంపి వేస్తామని బెదిరించారు. కావున వారి పైన చట్ట రీత్యా తగు చర్యలు తీసుకొవాలని, ఆసుపత్రి యాజమాన్యమైన ప్రభుత్వ డాక్టర్ నాగిరెడ్డి, అందులో భాగసౌమ్యులైయుండి, కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ ఆర్.జె.స్వాతి లను వెంటనే సస్పెండ్ చేయాలని అని కోరారు. ఈ దౌర్జన్యములో పాల్గొన్న డా.బి.అనిల్ కుమార్ పైన తగు చర్యలు తీసుకుంటూ, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయుటకు మెడికల్ కౌన్సిల్ బోర్డు కు సిఫారసు చేయవలసినదిగా కోరారు. ఈ దౌర్జన్యములో పాల్గొన్న మహంకాళి స్వామి, అతని అనుచరులు, హాస్పిటల్ యజమాన్యం, రిసెప్షనిస్ట్ ఆనంద్ పైన చర్యలు తీసుకోవాలని, అక్రమ కేసు బనాయించిన ఆనంద్ కేసు ఉపసంహరించుకోవలసినదిగా డిమాండ్ చేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మహిళ అయిన డా.జి. అన్నా ప్రసన్నకుమారి కి తగు రక్షణ కల్పించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ బి .శ్రీరాములు, డాక్టర్ బి.కిరణ్ కుమార్, వీరగోని శ్రీనివాస్, టి ఎన్ జి ఓ హెల్త్ ఫోరం అధ్యక్షులు, ఉమమహేశ్వర్, టి.జి.ఓ. హెల్త్ ఫోరం అధ్యక్షులు, దేవీ సింగ్, రాష్ట్ర పారా మెడికల్ ఆఫీసర్ ల ఫోరం అధ్యక్షులు, ఆర్.బి.ఎస్. కె డాక్టర్లు, కె రమేష్, టి రాజేష్, సాలమ్మ, దాయా మని, ఎన్ హెచ్ ఎమ్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కిల్ హబ్ కు దరఖాస్తుకోవాలి

రేపల్లె. (జనం రిపోర్టర్) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ వారు బాపట్ల జిల్లా రేపల్లెలోని ఎబిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్-రేపల్లె నందు ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ నందు ఆసక్తిగల అభ్యర్థుల నుండి వివిధ శిక్షణ కార్యక్రమముల కొరకు దరఖాస్తులు స్వీకరించుచున్నారు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. శ్రీ. టి. సి. రవి చంద్రకుమార్ తెలియచేసారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఈ స్కిల్ హబ్ సెంటర్ నందు పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి అనంతరం విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ(%చీూణజ%) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(%ూూూణజ%) ల వారి నుండి సర్టిఫికెట్ జారీ చేయబడునని మరియు అర్హతలను బట్టి అభ్యర్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలియచేసారు. ఈ శిక్షణ కోర్సులకు కనీస వయస్సు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి మరియు ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ ఆపైన చదివి పాసైన/ఫెయిల్ అయిన పు/స్త్రీ అభ్యర్థులు ఈ శిక్షణా కార్యక్రమము నకు అర్హులు. శిక్షణ అందించు కోర్సుల వివరములు:1. వెబ్ డెవలపర్ 2. అకౌంట్స్ అసిస్టెంట్కాల వ్యవధి:3నెలలు. రిజిస్ట్రేషన్ కొరకు క్రింద ఇవ్వబడిన లింక్ నందు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకునవలెను. మరిన్ని వివరములకు ఫోన్ 9347468946 నెంబర్ ద్వారా తెలుసుకొనగలరని తెలియజేశారుఆపరేషన్ కగార్ను వెంటనే నిలిపివేయాలి....మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి....

## ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం....




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై హత్యాకాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్గఢ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి, మావోయిస్టు పార్టీని అంతం చేయాలని కేంద్రం ప్రకటించిందనీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమీత్షా చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం అప్రజాస్వామికమని ఆయన అన్నారు. సైన్యం తమ సొంత ఆస్తిగా కేంద్ర హెూం శాఖ మంత్రి మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులు శాంతి చర్చలకు పిలవాలని కోరుతుంటే, వారిని గౌరవించి పిలువకుండా తుది ముట్టించేదాకా వదలబోమనటం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్గఢ్ అడవుల్లోని ఆదివాసీలను నిర్మూలించే పద్ధతిని మోడీ సర్కారు కొనసాగిస్తున్నదన్నారు. సాయుధలైన మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య జరుగుతున్న యుద్ధంలా అది లేదనీ, బలగాలు అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి వారిని అడవుల నుంచి వెళ్లగొట్టేలా ఉందని ఆయన అన్నారు. అక్కడ మానవ, ఆదివాసీ, గిరిజన హక్కులను హరణ జరుగుతున్నదని, ఛత్తీస్గఢ్ అటవీ ప్రాంతంలోని విలువైన స్వదేశీ ఖనిజ సంపదను, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాని వెనుక ఉన్నదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని ,ఇప్పటికే శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు స్పందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మండలంలో ముమ్మరంగా దోమల మందు స్ప్రెయింగ్ రాజవొమ్మంగి, ఏప్రిల్ 29 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలోని మంగళవారం బోనంగిపాలెం,గడుఓకుర్తి గ్రామాల్లో దోమల నివారణ మందు ఎసిఎం5% పిచికారి పనులు పూర్తి చేసినట్లు ఎస్ యు ఓ అధికారి చీడిపల్లి ప్రసాద్ తెలిపారు అలాగే బుధవారం చీడిపాలెం గ్రామంలో దోమల పిచికారీ జరుగుతుందని ఆయన తెలిపారు గ్రామస్తులు ఇళ్ళ వద్ద ఉండి ఇంటి లోపల బయట వస్తువులు సర్దుకొని దోమల నివారణ చర్యల్లో భాగంగా పిచికారి సిబ్బందికి సహకారం అందించాలని కోరారు దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా,డెంగీ,ఫైలరియా, మెదడు వాపువ్యాధులు తదితర వ్యాధులు అరికట్టాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది,స్ప్రేయింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణి



నందలూరు, (జనం రిపోర్టర్) :నందలూరు పంచాయతీకి చెందిన పూల సురేష్ కుమార్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, బిజెపి రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగే రాంప్రసాద్, బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదడుకు సంబంధించిన అనారోగ్య కారణంగా వేలూరు సి ఎం సి హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న సందర్భంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితిలో సాయి లోకేష్ వద్దకు వెళ్లి ప్రభుత్వ సాయం కోరడం జరిగింది. సాయి లోకేష్ వారి దయనీయ పరిస్థితిని గమనించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుబాటి పురందరేశ్వరి దృష్టికి తీసుకువెళ్లి సురేష్ అనారోగ్యం, వైద్యానికి అయిన లక్షల రూపాయల ఖర్చులకు సంబంధించిన బిల్లులు అన్ని చూపించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వీరి కుటుంబానికి తప్పనిసరిగా సాయం అందేలా చూడాలని కోరడం జరిగింది. పురందరేశ్వరి వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని పూల సురేష్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కోరగా, ముఖ్యమంత్రి సురేష్ కి 4,61,770/- ను మంజూరు చేయడం జరిగింది. దానికి సంబంధించి మంగళవారం ఉదయం స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి సురేష్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ కార్యకర్తలూ, రాచూరి మురళి, జయకుమార్ రెడ్డి, మహేష్, హెచ్. డి ప్రసాద్, మండెం నాగేంద్ర, గంగాధర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రాజధాని పునః ప్రారంభానికి హాజరవ్వాలి.ధూళిపాళ్ల



పొన్నూరు ఏప్రిల్ 29. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మంగళవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2.న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న అమరావతి ప్రజా రాజధాని పునః ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోది ముఖ్య అతిథిగా హాజరుకానున్నందున గ్రామ గ్రామాన ప్రజలు ఈ వేడుకకు హాజరై భవిష్యత్ రాజధాని మీద మన ఆకాంక్షలు తెలియజేసేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని ప్రజా మద్దతును తెలియజేసేందుకు సమాయత్తం కావాలని ధూళిపాళ్ళ పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అమరావతిలో చేపట్టనున్న పలు ప్రభుత్వ , కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని ధూళిపాళ్ల ఈ సందర్భంగా తెలిపారు.నియోజకవర్గ గ్రామాలు, ప్రాంతమంతా కూడా అమరావతి అభివృద్ధితో ముడిపడి ఉన్నాయనే అంశాన్ని ఆయన గుర్తు చేశారు.కార్యక్రమంలో పట్టణ, రూరల్ మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకున్న మనాలి ఠాకూర్...



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ ఆదేశాలమేరకు,మంగళవారం రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం, పాలకుర్తి గ్రామంలో శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ఉపాధి హామీ కూలీలను కలిశారు. పాలకుర్తి గ్రామంలోని ఉపాధి పనుల ప్రాంగణంలో కూలీలతో మమేకమై వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, "ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ



ప్రాంతాల్లో జీవనోపాధిని మెరుగుపరచడం, గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయడం రాజ్ ఠాకూర్ ప్రధాన లక్ష్యం" అన్నారు.ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి రాజ్ ఠాకూర్ కట్టుబడి ఉన్నారని హామీ ఇచ్చారు.అలాగే, ఉపాధి పనుల్లో నాణ్యత, సమర్థత పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, అందరికీ ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారు స్పష్టం చేశారు.అంతేకాక, మనాలి ఠాకూర్ గ్రామస్థులతో ముచ్చటించి, వారికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ విభాగల అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

## ఉగ్రదాడులను ఖండిస్తూ ముస్లింల కొవ్వొత్తుల శాంతి ర్యాలీ







నార్పల (జనం రిపోర్టర్) : పెహల్గాం ఉగ్రదాడులను నిరసిస్తూ మంగళవారం సాయంత్రం నార్పలలో ముస్లింలు స్థానిక జామియా మసీదు నుండి గాంధీ సర్కిల్ వరకు జాతీయ జెండాలు పట్టుకుని, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రతి భారతీయుడు సిద్ధంగా ఉండాలని, దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు ముత్తువల్లి ఇక్బాల్ భాష పేర్కొన్నారు. అనంతరం ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఖాజీ ఫయాజ్ భాష, మౌలానా లు, జక్రియ, మన్సూర్, ఫారుక్, రెహమాన్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధితులకు ఆర్థిక సహాయం



రేపల్లె (జనం రిపోర్టర్) :..రేపల్లె పట్టణ18 వ వార్డు నందు గల కారుమూరి శ్రీనివాసరావు గారి ఇల్లు అగ్నిప్రమాదమునకు గురైనదని తెలుసుకొని, రేపల్లె నియో రెజ్జకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి మహిళా విభాగమునకు సంబంధించిన, మహిళా నాయకులు చందోలు నాగలక్ష్మి కుమారి %=×% విభాగం.. రేపల్లె నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు వీసా నాగలక్ష్మి గారు.. సజ్జా పద్మావతి .. 4వ వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి .. 23 వ వార్డు శారదా , సుజాత టీచర్ వీరందరి సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, బియ్యం ,నిత్యవసర సరుకులు, దుప్పట్లు, చీరలు, కూరగాయలు, అందజేయటం చేయడం జరిగింది...

## ప్రతి రైతు ఆంధ్ర ప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ చేయాల్సిందే! వ్యవసాయ శాఖ -



శింగనమల మండల(జనం రిపోర్టర్) : పరిధి లోని రైతులందరూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ కి (ఏపీఎఫ్ఆర్) ప్రతి రైతు 11 అంకెల రిజిస్ట్రేషన్ నెంబర్ కోసం రైతుల వివరాలను దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయుంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి అన్వేష్ మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 7820 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి అయిందని, 3262 మంది రైతులు నమోదు చేయించుకోవాల్సి ఉందని తెలుపుతూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు పథకాల లబ్ది పొందటానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ముఖ్యంగా పి ఏం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాలలోకి జమ కావాలంటే ఈ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. జాయింట్ ఎల్ పి లు కూడా ప్రస్తుతం రిజిష్టర్ అవుతున్నాయని, జాయింట్ ఎల్ పి ఉన్న రైతులు కూడా వ్యవసాయ సిబ్బంది ని సంప్రదించి ఏపిఎఫ్ఆర్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

## తిరుణాల భక్తులకు ఆరంజ్ రస్నా పంపిణీ చేసినజనసేన నాయకులు





పొన్నూరు ఏప్రిల్ 29. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ 18 వార్డు జి బి సి రోడ్డులో వేచ్చేసి ఉన్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తిరుణాల సందర్భంగా శ్రీ పోలేరమ్మ తల్లికి జనసేన పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం జనసేన జిల్లా కార్యదర్శి దేశంశెట్టి సూర్య ఆధ్వర్యంలో తిరుణాల సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు వేసవి తాపాన్ని తీర్చే చల్లని ఆరెంజ్ రస్నా , తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు గడ్డమూరి చందు, ఆకుల గోపి, పోడకట్ల ప్రసాద్, షేక్ యాజ్ బాషా, చక్కల అజయ్ తుమ్మల గోపి,ఎర్ర ధనుంజయ్ ,జనసైనికులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ చేతుల మీదుగా ప్రారంభించిన విశాకా ఇండస్ట్రీస్ ఆటమ్ సోలార్ రూఫ్, ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు,ఆటమ్ ఈ-బైక్ ప్రారంభం...



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. పునరుత్పాదక ఇంధన రంగాన్ని పురోగమింపజేసే దిశగా,రాహుల్ గాంధీ నేడు రాయ్‌బరేలీలో విశాకా ఇండస్ట్రీస్ రూపొందించిన ఆటమ్ సోలార్ రూఫ్ ను అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమం భారతదేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని,గ్రీన్ మోబిలిటీ పరిష్కారాలను వేగవంతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు.ఈ ప్రారంభ వేడుకలో,ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు,ఆటమ్ ఈ-బైక్లను కూడా ప్రారంభించారు.ఈ ఆవిష్కారాలు విశాకా ఇండస్ట్రీస్ యొక్క పర్యావరణ అనుకూలమైన, ఆవిష్కరణాత్మక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు..డా.వివేక్ చెన్నూర్,ఎమ్మెల్యే సరోజ గడ్డం, కారెస్పాండెంట్,డా.బి.ఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలు, వంశీ గడ్డం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు,విశాకా ఇండస్ట్రీస్ జేఎండి.

## మే-డే ను కార్మిక హక్కుల దీక్ష దినంగా పాటించండి....! అడ్డా కూలీలందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలి....

# - సిఐటియు డిమాండ్...



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. మంగళవారం 139వ. మే డే ను "కార్మిక హక్కుల దీక్ష దినం మేడే" కరపత్రాన్ని ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ లోని లేబర్ అడ్డలో సిఐటియు ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ తరపున కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బిక్షపతి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి లు మాట్లాడుతూ, ఈసారి మే డే ను కార్మిక హక్కుల సాధన కోసం జరిగే పోరాట దీక్ష దినంగా జరుపుకోవాలి, బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి మేడే హక్కు అయినా 8 గంటల పని దినంను, 12 గంటలకు మార్చి మేడే త్యాగాలను కాలరాస్తున్నది. వెల్ఫేర్ పథకాలకు తిలోదకాలు ఇవ్వడం, కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే విధంగా తయారు చేస్తున్నది. దానికి వ్యతిరేకంగా జరిగే మే 20 సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అడ్డ మీద కూలీలకు ఎలాంటి రక్షణ లేని ఈ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించటం లేదు, కాబట్టి లేబర్ అధికారులు అడ్డాల మీది సర్వేలు చేసి కార్మికులను చైతన్యపరిచి, ఈ శ్రమ లేబర్ కార్డు ని అందరికీ వచ్చేలాగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, అలాగే లేబర్ వేచి ఉండడానికి అడ్డలో షెడ్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. మే 1న. జరిగే మేడే కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, ఎన్టిపిసి రామగుండం ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, నాయకులు కనకయ్య, వెంకటేష్, రాధా, అధిక సంఖ్యలో అడ్డ కూలీలు పాల్గొన్నారు.

## విట్టల్ నగర్‌లో మక్కాన్ సింగ్ సేవ సమితి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభం....



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 29. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 13వ. డివిజన్ విట్టల్ నగర్‌లో మక్కాన్ సింగ్ సేవ సమితి ఆధ్వర్యంలో... కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ఘనంగా ప్రారంభించారు.స్థానిక మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను అందించే ఉద్దేశంతో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ గారు మాట్లాడుతూ,



మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉండేందుకు ఈ తరహా శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి మహిళ ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ జీవితాల్లో ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సేవా సమితి సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) :అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని బిజెపి నాయకులు విజయ్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎనిమిదో వార్డులో బిజెపి నాయకులు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఇల్లు కూలిపోయిన బేస్మెంట్ వేసుకున్న ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయాలని కమిషనర్ ను డిమాండ్ చేశారు. అనర్హులకు ఇండ్లు కేటాయిస్తే మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సర్వేలో స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో ముమ్మరంగా దోమల మందు స్ప్రేయింగ్



రాజవొమ్మంగి, ఏప్రిల్ 29 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలోని మంగళవారం బోనంగిపాలెం,గడుఓకుర్తి గ్రామాల్లో దోమల నివారణ మందు ఎసిఎం5% పిచికారి పనులు పూర్తి చేసినట్లు ఎస్ యు ఓ అధికారి చీడిపల్లి ప్రసాద్ తెలిపారు అలాగే బుధవారం చీడిపాలెం గ్రామంలో దోమల పిచికారీ జరుగుతుందని ఆయన తెలిపారు గ్రామస్తులు ఇళ్ళ వద్ద ఉండి ఇంటి లోపల బయట వస్తువులు సర్దుకొని దోమల నివారణ చర్యల్లో భాగంగా పిచికారి సిబ్బందికి సహకారం అందించాలని కోరారు దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా,డెంగీ,ఫైలేరియా, మెదడు వాపువ్యాధులు తదితర వ్యాధులు అరికట్టాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది,స్ప్రేయింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కొత్త నిబంధనలు.. లబ్ధిదారుల్లో గందరగోళం




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. తమకు నచ్చిన విస్తీర్ణంలో ఇళ్లు కట్టుకోవచ్చని గతంలో చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు అందుకు ఒప్పుకోవడం లేదు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆర్థిక సాయం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఫస్ట్ ఫేజ్‌లో 70,122 ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే ఇప్పటికే 2,800 మంది పునాది వరకు నిర్మాణం చేపట్టారు. వీరిలో సుమారు 300 మంది 600 చదరపు అడుగులకు మించి ఇళ్లు నిర్మిస్తున్నారు. అధికారులు కొత్తగా జారీ చేసిన నిబంధనలపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద.. ఇంటిని 600 చదరపు అడుగుల్లోపు నిర్మిస్తేనే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ స్పష్టం చేశారు. 600 దాటితే పథకానికి అనర్హులని తెలిపారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను 400 నుంచి 600 ఎస్ఎఫ్‌టీ లోపే నిర్మించాలని సూచించారు. 600 చదరపు అడుగుల దాటితే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అనర్హులు అవుతారని తెలిపారు.

## బ్రదర్ కేటీఆర్.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా



తాడేపల్లి: జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా గాయపడిన మాజీ మంత్రి కేటీఆర్ త్వరగా కోలుకోవాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. బ్రదర్ కేటీఆర్.. మీరు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని వైఎస్ జగన్ పోస్టు చేశారు. ఇక, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా గాయపడ్డారు. దీంతో, కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని కేటీఆర్‌కు వైద్యులు ఆయనకు సూచించారు. ఈ విషయాన్ని కేటీఆర్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. వైద్యుల పర్యవేక్షణలో రికవరీ అవుతున్నట్లు పేర్కొన్నారు. త్వరగా కోలుకొని రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న పలువురు నేతలు, అభిమానులు కేటీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పోస్టులు పెడుతున్నారు.

## పహల్గాం ఉగ్రదాడి.. కేంద్రం కీలకనిర్ణయం..

# 48 టూరిస్టు ప్రాంతాల మూసివేత..




**న్యూఢిల్లీ,:** పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత మంగళవారం జరిగిన ఈ ఉగ్రదాడిలో 27 మందు టూరిస్టులు మృతి చెందారు. ప్రధానంగా మతం గురించి ఆరా తీసి హిందూ అని చెప్పగానే వాళ్లను గన్‌తో ఉగ్రవాదులు పేల్చివేశారు. పాకిస్తాన్ చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఈ ఘాతాకానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఓసి వద్ద కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం వచ్చే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది. ఇది మాత్రమే కాదు ఇప్పటికే సింధు జలాలను కూడా కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో కశ్మీర్‌కు చెందిన పలువురు మంత్రులు, నేతలు పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారు. అణ్వాయుధాలు ప్రయోగించాల్సి ఉంటుంది, సింధు నది జలాల్లో నీరు పారకుంటే వారి రక్తం పారుతుందని భారత్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేస్తున్నారు. కీలక ఆధారాలు కూడా ఇప్పటికే ఎన్ఐఏ చేతిలో ఉంది. ఓ ఫోటోగ్రాఫర్ దాడి సమయంలో చెట్టుపైకి ఎక్కి వీడియోని తీశారు. అది ఇప్పుడు కీలకంగా మారింది. అయితే పహల్గాం టూర్‌కు వచ్చిన కొంత మందిపై టూరిస్టులపై ఉగ్రవాదులు దాడులు చేశారు. ముందస్తుగా రెక్కీ వేసి మతం ఆరా తీసి వారని గన్‌తో షూట్ చేసి చంపేశారు. ప్రధానంగా మగవాళ్లను లక్ష్యంగా చేసుకొని హిందూ అనగానే చంపేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోయలోని 48 టూరిస్టు ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం మూసివేసింది. మొత్తంగా 87 పర్యాటక ప్రాంతాలు ఉండగా అందులో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను ప్రస్తుతం టూరిస్టులకు అనుమతించడం లేదు. 48 చోట్ల సాయుధ బలగాలతో భద్రత కల్పించిన తర్వాతే వాటిని ఓపెన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన టూరిస్ట్ ప్రాంతాల్లో మాత్రం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మరోవైపు హిందూ జలాల నిలిపివేత కారణంగా పాక్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ కు భారత్ సింధుజలాలను నిలిపివేసింది.ఈ క్రమంలో పాకిస్తాన్ ప్రభుత్వం అప్రమత్తమై ఎటు పాలు పోనీ దుస్థితిలో ఉంది. ఇక ప్రధాని షహబాజ్ షరీఫ్ దేశంలోని నీటి నిర్వహణ సదుపాయాల కోసం కమిటీ ఏర్పాటు చేసి అత్యవసర సమావేశం కూడా నిర్వహించారు. పరిష్కారంతోపాటు దీర్ఘకాలిక వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మార్గాలను ఈ కమిటీ ప్రతిపాదించింది. ఇదిలా ఉండగా ఎల్‌ఓసి వద్ద పాక్ గడిచిన నాలుగు రోజుల నుంచి కాల్పులు జరుపుతూనే ఉంది. సరిహద్దుల వెంట పాకిస్తాన్ ఆర్మీ వక్ర బుద్ధి చూపుతూనే ఉంది. నిన్న అర్ధరాత్రి కూడా కుప్వారా, బారముల్ల జిల్లాలోని అక్నూర్ సెక్టార్ లో ఆ దేశం కాల్పులకు తెగబడినట్లు సమాచారం. వీటిని సమర్థవంతంగా భారత సైన్యం కూడా తిప్పి కొడుతోందని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ సైన్యం రోజు సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూనే ఉన్న సంగతి తెలిసిందే.

## యాప్ స్టోర్.. ఏడాదిలో రూ.44 వేల కోట్ల విక్రయాలు




**న్యూఢిల్లీ,:** టెక్ దిగ్గజం యాపిల్ యాప్ స్టోర్ ద్వారా గతేడాది రూ.44,447 కోట్ల విలువ చేసే డెవలపర్ల బిల్లింగులు, విక్రయాలు (ఉత్పత్తులు, సేవలు) నమోదయ్యాయి. యాపిల్‌కి కమీషన్లులాంటివి లేకుండా ఇందులో 94 శాతం భాగం నేరుగా డెవలపర్లు, వ్యాపార సంస్థలకే లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్)కి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ్ పింగళి నిర్వహించిన అధ్యయన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. నివేదికలోని అంశాల ప్రకారం గత అయిదేళ్లలో భారతీయ డెవలపర్లకు అంతర్జాతీయంగా వచ్చే ఆదాయాలు రెట్టింపయ్యాయి. ఫుడ్ డెలివరీ, ట్రావెల్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర రంగాలకు చెందిన యాప్‌ల వినియోగం గణనీయంగా పెరిగింది. గతేడాది భారతీయ డెవలపర్ల ఆదాయాల్లో దాదాపు 80 శాతం వాటా ఇతర దేశాల్లోని యూజర్ల నుంచే వచ్చింది. ఏడాది పొడవున యాప్ స్టోర్ నుంచి 75.5 కోట్ల సార్లు మన డెవలపర్ల యాప్‌లను యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. భారతదేశంలోని డెవలపర్ల సృజనాత్మకత, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంలో యాప్ స్టోర్ కీలక పాత్ర పోషిస్తుంది. యాపిల్ వ్యాపార నమూనాలో 'ఫ్రీ'మియం(ఉచితం) యాప్‌లు, పెయిడ్ యాప్‌లు, ఇన్-యాప్ పర్చేజ్‌లు లేదా సబ్‌స్క్రిప్షన్‌లతో కూడిన యాప్‌లు వంటి వివిధ మానిటైజేషన్ విధానాలు ఉన్నాయి. ఇది డెవలపర్లను వారి లక్ష్యాలకు అనుగుణంగా టార్గెటెడ్ ఆడియన్స్‌ను ఎంచుకునేందుకు వీలు కల్పిస్తుంది.

## అమరావతి రాజధానికి చట్టబద్ధత..!

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కలిగించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.. దీనిపై కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి నారాయణ.. రాజధాని అమరావతికి చట్టబద్ధత కలిగించే దిశగా సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడతారన్నారు అని వెల్లడించారు మంత్రి నారాయణ.. చట్టబద్ధత విషయంలో రైతుల్లో ఉన్న ఆందోళన నిన్న సీఎం దృష్టికి రైతులు తీసుకు వచ్చారన్నారు నారాయణ.. రాజధాని ప్రాంతంలో పర్యటించిన ఆయన.. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లును పరిశీలించారు.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాజధాని అమరావతి కాదని చెప్పింది.. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైందన్నారు.. ఇదే విషయాన్ని రైతులు సీఎం చంద్రబాబు దృష్టికి నిన్న తీసుకువచ్చారు.. న్యాయ పరమైన అంశాలు చర్చించి కేంద్రంతో మాట్లాడతా అని సీఎం చంద్రబాబు.. రైతులకు చెప్పారని వెల్లడించారు.. ఇక, ప్రధాని పర్యటనకు సంబంధించి పనులు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు మంత్రి నారాయణ.. 41 వేల కోట్ల విలువైన పనులకు శంఖుస్థాపన గతంలో జరిగింది.. గత ప్రభుత్వం టెండర్లు రద్దు చేయలేదు.. న్యాయపరంగా ఇబ్బందులు వచ్చాయన్నారు.. మళ్లీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు ప్రారంభం అయ్యాయి.. 8 నెలలు నుంచి రాజధానిపై కసరత్తు చేస్తున్నాం అన్నారు.. మళ్లీ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీద పనులు మళ్లీ ప్రారంభం అవుతాయని తెలిపారు మంత్రి నారాయణ.. కాగా, ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ విభజన చట్టంలో పార్లమెంటు ద్వారా సవరణ చేసేందుకు అవకాశం ఉందేమో పరిశీలించి, చేయిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్న విషయం విదితమే.. ఈ అంశాన్ని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళతానని.. రాజధాని ప్రాంత రైతులకు హామీ ఇచ్చారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారు.. ఇప్పుడు ఆ గడువు ముగియడంతో.. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేందుకు ఇబ్బంది ఉండకపోవచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్న విషయం విదితమే..

# రికార్డు స్థాయికి ప్రపంచ సైనిక వ్యయం

## 2024లో 2.7 ట్రిలియన్ డాలర్లు

ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం భారీగా పెరిగింది. మారుతున్న భౌగోళిక, రాజకీయ సంబంధాలు, యుద్ధాల నేపథ్యంలో ప్రభుత్వాలు సైనిక భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. 2024లో ప్రపంచ దేశాలు సైన్యానికి 2.7 ట్రిలియన్ డాలర్లను ఖర్చు చేశాయి. గాజా, ఉక్రెయిన్‌లపై యుద్ధం నేపథ్యంలో ముఖ్యంగా యూరప్, మధ్యప్రాచ్యంలో ఈ సైనిక వ్యయం అధికంగా పెరిగింది. తాజా వివరాలను స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) నివేదిక తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాలు తమ సైనిక వ్యయాన్ని పెంచాయి. 2023తో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఖర్చు 9.4 శాతం పెరిగింది. వరుసగా పదో సంవత్సరం కూడా సైనిక వ్యయంలో పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతలకు అద్దం పడుతోంది.

### యూరప్‌లో ఊహించని పెరుగుదల

యూరప్ దేశాల్లో (రష్యాతో సహా) సైనిక వ్యయంలో అధిక పెరుగుదల కనిపించింది. ఉక్రెయిన్‌లో యుద్ధం, నాటో కూటమి పట్ల అమెరికా నిబద్ధతపై సందేహాల మధ్య 17 శాతం పెరుగుదల నమోదైంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగింపు సమయంలో సైనిక వ్యయాన్ని మించిపోయింది. ఇక రష్యా సైనిక వ్యయం 2024లో 149 బిలియన్ డాలర్లకు చేరుకుంది, ఇది 2023తో పోలిస్తే 38 శాతం పెరిగింది. ఇది రష్యా జీడీపీలో 7.1 శాతం. మొత్తం ప్రభుత్వ వ్యయంలో 19%. ఉక్రెయిన్ మొత్తం సైనిక వ్యయం 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది రష్యా వ్యయంలో 43 శాతం కాగా, ఆ దేశ జీడీపీలో 34 శాతం. 2024లో అత్యధిక సైనిక వ్యయం చేసిన దేశం ఉక్రెయిన్. రష్యా చేస్తున్న యుద్ధానికి ఉక్రెయిన్ ప్రస్తుతం తన పన్ను ఆదాయం మొత్తాన్ని సైన్యానికి కేటాయిస్తోంది. జర్మనీ కూడా సైనిక వ్యయాన్ని బాగానే పెంచింది. 28 శాతం పెరిగి, 88.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో ఇది భారతదేశాన్ని అధిగమించి ప్రపంచంలో నాల్గో అతి పెద్ద దేశంగా నిలిచింది. పునరేకీకరణ తరువాత జర్మనీ ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేయడం ఇదే మొదటిసారి.



### వ్యయాన్ని పెంచిన చైనా

సైన్యానికి భారీగా ఖర్చు చేసే ప్రపంచంలోనే రెండో దేశమైన చైనా సైతం తన సైనిక బడ్జెట్‌ను పెంచింది. 7.0 శాతం పెరుగుదలతో చైనా సైనిక వ్యయం 314 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తన సైన్యాన్ని ఆధునీకరించడానికి, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు పెంచుకోవడానికి, అణ్వాయుధాల విస్తరణలో విస్తృతమైన పెట్టుబడులు పెడుతోంది. ఆసియా మొత్తం సైనిక వ్యయంలో సగం వాటాను చైనానే కలిగి ఉంది.

### తగ్గేదే లేదన్న అమెరికా

ప్రపంచ పెద్దన్న అమెరికా కూ సైనిక వ్యయంలో వెనుకబడలేదు. మొత్తం ప్రపంచ సైనిక వ్యయంలో అమెరికా వాటా 37 శాతం గమనార్హం. ఇక 2024లో మొత్తం నాటో వ్యయంలో 66 శాతం అమెరికా పెట్టుబడులే. 2024లో 5.7 శాతం పెంచడంతో ఆ దేశ సైనిక వ్యయం 997 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అమెరికా నేతృత్వంలోని కూటమిలోని 32 సభ్యదేశాల మొత్తం సైనిక వ్యయం 1.5 ట్రిలియన్లకు పెరిగింది.

### 2025లో రక్షణకు అత్యధిక బడ్జెట్‌ను కేటాయించిన దేశాలు

అస్థిర, సంక్లిష్ట భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు తమ శక్తిని, పలుకుబడిని చాటుకునేందుకు సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటున్నాయి. గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ డేటా ప్రకారం అమెరికా, చైనా, రష్యా, భారత్, సౌదీ అరేబియాలు తమ సైనిక శక్తికి అత్యధిక బడ్జెట్ కేయటాంచిన మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

**యూఎస్ - 895 బిలియన్ డాలర్లు**
**చైనా - 266.85 బిలియన్ డాలర్లు**
**రష్యా - 126 బిలియన్ డాలర్లు**
**భారత్ - 75 బిలియన్ డాలర్లు**
**సౌదీ అరేబియా - 74.76 బిలియన్ డాలర్లు**

# ఏఐనా.. అంటే..

స్పెషల్ డెస్క్: ఓవైపు అగ్ర దేశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వాడకం విస్తృతంగా కొనసాగుతుంటే ఆ దేశాలతో అన్ని రంగాల్లో పోటీపడుతున్న భారత్ మాత్రం ఏఐని అందిపుచ్చుకోవడంలో ఇంకా ప్రారంభ స్థాయిలోనే ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఏకంగా 60% మంది భారతీయులకు ఏఐ గురించి తెలియదని



టెక్నాలజీ దిగ్గజం గూగుల్, మార్కెట్ పరిశోధన సంస్థ కాంటార్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం తేల్చింది. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో కేవలం 31% మందే జనరేటివ్ ఏఐ సాధనాలను వినియోగిస్తున్నారు.



### జీవితాల మెరుగుదల కోసం..

అత్యధికులకు ఇప్పటికీ ఏఐ గురించి తెలియకపోయినా తమ జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఏఐ వంటి సాధనాలను ఉపయోగించాలనే కోరిక ఎక్కువ మందిలో ఉంది. మరింత ఉత్పాదకత పొందాలని 72% మంది, సృజనాత్మకతను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని 77% మంది, మరింత సమర్థంగా సమాచారాన్ని తెలియజేయాలని 73% మంది చూస్తున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా రాణించడానికి సహాయపడే సాధనాన్ని 75 శాతం మంది కోరుకుంటున్నారు.



### పారంభించడమూ తెలియదు..

పనిప్రదేశం లేదా తరగతి గదికి మించి భారతీయులు రోజువారీ పనుల్లో కూడా సహాయం కోసం ఆసక్తిగా ఉన్నారు. ప్రయాణ ప్రణాళిక నుంచి బడ్జెట్‌లను నిర్వహించడం వరకు 76% మంది తమ సమయం ఆదా చేయడంలో సహాయం కోరుకుంటున్నారు. పిల్లలకు హోంవర్క్‌లో చేదోడు లేదా వంట వంటి కొత్త అభిరుచులను అన్వేషించడం.. ఇలా రోజువారీ జీవితంలో మరింత సృజనాత్మకంగా ఉండాలని 84% మంది ఆశిస్తున్నారు. ఏఐ వినియోగంలో చాలా మంది నిరంతర అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ఏఐని ఎలా ప్రారంభించాలో 68% మందికి తెలియడంలేదు. అందుకు నైపుణ్యం లేదా మార్గదర్శకత్వం లేకపోవడాన్ని 52% మంది ఉదహరిస్తున్నారు. అటువంటి అడ్డంకుల కారణంగా వృత్తిపరమైన లేదా సృజనాత్మక ఆకాంక్షను వదులుకున్నామని 61% మంది చెప్పారు.

### మార్పు తెచ్చిన జెమినై..

తమ ఏఐ ప్లాట్‌ఫామ్ జెమినైని మొదటగా స్వీకరించినవారు ఇప్పటికే గణనీయంగా ప్రయోజనాలను ఆస్వాదిస్తున్నారని గూగుల్ తెలిపింది. దేశంలోని 92% జెమినై వినియోగదారుల విశ్వాసాన్ని ఈ సాధనం మెరుగుపరిచిందని వెల్లడించింది. ముఖ్యంగా జనరేషన్ జెడ్ (94%), విద్యార్థులు (95%), మహిళల్లో (94%) జెమినై అధిక ప్రభావం ఉందని వివరించింది. ఏఐ వినియోగం 93% మంది వినియోగదార్ల ఉత్పాదకతను పెంచిందని తెలిపింది. సృజనాత్మకంగా ఆలోచించడంలో 85% మందికి సహాయపడిందని గూగుల్ వివరించింది.

# కళ తప్పిన బైండ్ల బతుకులు

## దుర్భరంగా బైండ్ల కళాకారుల జీవనం

## ఆలయాల్లో అర్చకులుగా అవకాశం ఇవ్వాలని వేడుకోలు




తొర్రూరు: ఒంటి నిండా రంగు.. గంభీరమైన ఆకారంతో.. ఇలాంటి పాటలు పాడుతూ గ్రామ దేవతలకు పూజలు చేసే కళాకారులే బైండ్ల కళాకారులు. జమిడిక తంత్రిని మునివేళ్లతో మీటుతూ రకరకాల శబ్దాలను పలికిస్తారు. ఒకప్పుడు రాజులకు వినోదాన్ని పంచిన ఈ కళ ప్రజలందరికీ చేరువలో ఉండేది. వంశపారంపర్యంగా వచ్చిన కళను కాపాడుతూ జీవం పోస్తున్నారు.

నేడు జమిడిక నాదం మూగబోయే స్థితికి..

అలాంటి జమిడిక నాదం ప్రస్తుతం మూగబోయే పరిస్థితి కనిపిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో డీజేల హోరు పెరగడంతో భవిష్యత్తులో బైండ్ల కళా ప్రదర్శన కనుమరుగయ్యే దుస్థితి నెలకొందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైండ్ల కళాకారులను



భవానీలు అని కూడా పిలుస్తారు. వీళ్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోనూ ఉన్నారు. వీరి పూజా విధానం కాస్త కష్టంగానే ఉన్నా.. ప్రజలను ఉర్రూతలూగిస్తుంది.

### గ్రామ దేవతలకు పూజలు చేస్తూ..

తెలుగు చరిత్రలో బైండ్ల కులస్తులకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ కళాకారులు మాదిగ కులస్తులకు పూజారులుగా, శక్తి ఆరాధకులుగా పేరొందారు. పూర్వం మాదిగ కులస్తులు జరుపుకొనే శుభకార్యాలకు ముహూర్తాలు పెట్టడమే కాకుండా పెళ్లితంతు జరిపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. పెళ్లిళ్లు, పండుగలు ఇతర కులాల వారితో చేయించడం వల్ల వారి ఉపాధి దెబ్బ తింది. ప్రస్తుతం వారు వంశానుక్రమంగా సంక్రమించిన గ్రామాలకు వెళ్లి ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ కథలు చెప్పి దేవతలను కొలిచే పూజారులుగా, కళాకారులుగానే మిగిలారు.

### 'జమిడిక' విన్యాసాలు

బైండ్ల కళాకారులు ఉపయోగించే వాయిద్యాన్ని 'జమిడిక' అంటారు. దీన్ని ఇత్తడితో తయారు చేస్తారు. జమిడికతో అనేక రకాల సంగీత ధ్వనులు పలికిస్తారు. పాట వరుసను అనుసరించి లయ మారుస్తుంటారు. కథకుడు కథాగానం చేస్తుంటే.. పక్కనున్న కళాకారులు వంత పాడుతూ జమిడిక వాయిస్తుంటారు. పల్లెల్లో ఎక్కువగా చేసుకునే రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ పండుగలప్పుడు పసుపు, కుంకుమలతో పట్నాలు వేసి దేవతలను కొలుస్తారు. దేవుళ్లకు బోనాలు సమర్పించిన రాత్రంతా గుడి దగ్గరే ఉంటారు. తెల్లవారుజాము వరకు ఆటపాటలతో దేవతల చరిత్ర చెబుతారు. పరశురాముడు, మాందాత, పోతరాజు, ఎల్లమ్మతో పాటు పలు రకాల వేషధారణలతో ఆకట్టుకుంటారు.

### నేడు ఉపాధి కరువై..

ప్రస్తుతం తెలంగాణలో కథాగానం చేసే బైండ్ల కళాకారులు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. ఆయా గ్రామాల్లో పండుగలు జరిగినప్పుడే వీరికి ఉపాధి దొరుకుతోంది. ఏటా కేవలం ఆషాఢం, శ్రావణ మాసాల్లోనే వీరికి ఉపాధి దొరుకుతోంది. మిగతా రోజులు కూలీ పనులు, వేరే వృత్తులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొత్త తరం ఈ కళారూపాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావడం లేదు. అక్కడక్కడా కళాకారులు తమ వారసత్వ కళా సంస్కృతిని కొనసాగించాలనే పట్టుదలతో తమ పిల్లలను చదివిస్తూనే




సందర్భాన్ని బట్టి వారికి కథలను నేర్పించే ప్రయత్నం చేస్తున్నారు.

### ప్రభుత్వ చేయూత కోసం..

శక్తి దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ వంటి దేవతల కథలు చెప్పే సంస్కృతి బైండ్ల కళాకారుల నుంచి అనాదిగా వస్తోంది. ఈ ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకం కింద బైండ్ల కళాకారులను చేర్చి అర్చకులుగా అవకాశమివ్వాలని వారు కోరుతున్నారు. దాంతో పాటు కళనే నమ్ముకుని వయోభారంతో ఇబ్బంది పడుతున్న వారికి.. ప్రభుత్వం ప్రత్యేక పథకాలు వర్తింపజేయాలని, కళాకారుల పింఛన్లు అందించాలని కోరుతున్నారు. భావితరాలకు ఈ కళను పరిచయం చేసేందుకు డాక్యుమెంటేషన్ చేయాలని కళాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తిరుమలలో గదుల బుకింగ్ ఇంత సులభమా?



**అమరావతి,:** శ్రీవారి భక్తులకు తిరుమల కొండపై గదులు దొరకడం అసాధ్యమనే ప్రచారం చాలా మంది భక్తుల్లో ఉంది. కానీ, తితిదే అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని సులభంగానే గదులను బుక్ చేసుకోవచ్చని చెబుతున్నారు. ఈ విషయంపై తితిదే అధికారులు ఒక వీడియోను కూడా షేర్ చేశారు. ఇందులో తిరుమలలో అందుబాటులో ఉన్న గదులను ఎలా బుక్ చేసుకోవచ్చో వివరించారు. ఈ వీడియో ప్రకారం.. తిరుమలకు వచ్చిన భక్తులు గదుల కోసం తిరుమల బస్టాండ్ దగ్గర ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ (సీఆర్ఓ)కు వెళ్లి అక్కడ ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు, దర్శనం టిక్కెట్, మొబైల్ నంబర్ తదితర వివరాలతో ఒక దరఖాస్తు ఫామ్‌ను నింపాల్సి ఉంటుంది. ఆ తర్వాత కార్యాలయ సిబ్బందికి దాన్ని అందిస్తే వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన 30 నిమిషాల్లో మీ రిజిస్ట్రేషన్ మొబైల్ నంబరుకు మనకు కేటాయించిన గది వివరాలతో కూడిన ఎస్ఎంఎస్ వస్తుంది. ఇక సీఆర్వో కార్యాలయం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తుంది. అయితే, ఈ గదుల కేటాయింపు మాత్రం తొలుత వచ్చినవారికి మాత్రే ఇస్తారు. సింగిల్ వ్యక్తికి గది ఇవ్వరు. కనీసం ఇద్దరు వ్యక్తులు ఉండాల్సివుంది. అలాగే, గదుల బుకింగ్ కోసం ఎలాంటి అడ్వాన్స్ సొమ్మును చెల్లించాల్సిన అవసరం కూడా లేదు.

## ముంబైలో భారీ అగ్నిప్రమాదం.. క్రోమా షోరూమ్‌లో ఎగసిపడిన మంటలు



ముంబై: ముంబైలోని బాంద్రాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున బాంద్రా వెస్ట్‌లోని లింక్ స్క్వేర్ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఉన్న క్రోమా షోరూమ్‌లో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి షో రూమ్ మొత్తం వ్యాపించడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలు క్రమంగా మాల్ మొత్తానికి విస్తరించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 12 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉదయం 4.11 గంటలకు అగ్నిప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిందని ముంబై ఫైర్ బ్రిగేడ్ వెల్లడించింది. రెండు గంటల్లోనే మంటలు బిల్డింగ్ మొత్తానికి ప్రమాదకర స్థాయికి వ్యాపించాయన్నారు. జీం3గా ఉన్న షాపింగ్ మాల్ భవనంలో మొదటి మూడు అంతస్తుల్లో క్రోమా షోరూమ్ ఉన్నదని చెప్పారు. దీంతో మంటలు వేగంగా బిల్డింగ్ మొత్తానికి వ్యాపించాయని తెలిపారు. 12 మోటార్ పంపుల సాయంతో సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు పోలీసులు సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎవరూ గాయపడలేదని చెప్పారు.

## పాకిస్తానీయులు భారత్ వీడేందుకు చివరి రోజు..



**న్యూఢిల్లీ,:** కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే భారత్ లో నివసిస్తున్న పాకిస్తానీయుల వీసాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నిర్దేశిత గడువులోపు దాయాది దేశ పౌరులు భారత్ విడిచి వెళ్లాలని తెలిపింది. పాకిస్తాన్ దేశస్థులు భారత్ ను వీడేందుకు ఏప్రిల్ 29 చివరి రోజు.. మెడికల్ వీసాలపై వచ్చిన వారికి కూడా ఇవాళ డెడ్ లైన్.. దేశం విడిచి వెళ్ళిపోవాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాక్ పౌరులు తమ దేశానికి వెళ్లిపోతున్నారు. ఇక, కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో తెలంగాణ పోలీసులు సైతం అలర్ట్ అయ్యారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్‌లో నమోదైన పాకిస్తాన్ పౌరుల వివరాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే డీజీపీ జితేందర్ కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలను పంపించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ లో ఉన్న పాక్ పౌరులు తమ దేశానికి వెళ్లిపోవాలి.. లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. కాగా, ఇప్పటికే నలుగురు పాకిస్తానీలు హైదరాబాద్ వదిలి పెట్టి వెళ్లిపోగా.. వారిలో ఒక పురుషుడు, ఒక మహిళ ఆమె కూతురు, మరో మహిళ ఉన్నారు.

## ఆధిక్యంలో దూసుకెళ్తున్న మార్క్ కార్నీ పార్టీ



**న్యూఢిల్లీ,:** అమెరికా వాణిజ్య యుద్ధం, కెనడాను అమెరికాలో ఒక రాష్ట్రంగా విలీనం చేస్తామంటూ ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో కెనడియన్లు అప్రమత్తం అయ్యారు. తదుపరి ప్రధానమంత్రి కోసం కెనడియన్లు సోమవారం ఓటేశారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. మార్క్ కార్నీ నేతృత్వంలోని లిబరల్ పార్టీ ప్రస్తుతం ఆధిక్యంలో దూసుకెళ్తోంది. పలుచోట్ల లిబరల్స్, కన్జర్వేటివ్‌ల మధ్య తీవ్రపోటీ నెలకొంది. నువ్వానేనా? అన్నట్టుగా పోటీపడుతున్నాయి. ప్రస్తుతం లిబరల్ పార్టీ 59 స్థానాల్లో విజయం సాధించింది. మరో 101 స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తోంది. కెనడా పార్లమెంట్‌లో మొత్తం 343 స్థానాలున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకకు 172 మంది సభ్యులు అవసరం. కెనడాలో 4 పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. లిబరల్ పార్టీ, కన్జర్వేటివ్ పార్టీ, న్యూ డెమోక్రాట్స్), బ్లాక్ క్యూబెకోయిస్ ఉన్నాయి. ప్రస్తుతం లిబరల్ పార్టీ దేశంలో అధికారంలో ఉంది. ఆ పార్టీకి 152 స్థానాలున్నాయి. ప్రతిపక్షంలో కన్జర్వేటివ్ పార్టీ ఉంది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో లిబరల్ పార్టీ 189 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. దీంతో మార్క్ కార్నీ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కన్జర్వేటివ్ పార్టీ సైతం గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించే ఛాన్సుంది. జనవరి 6 ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మార్క్ కార్నీ ప్రధాని అయ్యారు. రెండుసార్లు సెంట్రల్ బ్యాంకులకు గవర్నర్‌గా మార్క్ కార్నీ పనిచేశారు. మార్చిలో కెనడా లిబరల్ పార్టీ నేతగా ఎన్నికైన తర్వాత దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. వెంటనే ఆయన సార్వత్రిక ఎన్నికలకు పిలుపునిచ్చారు. కెనడాలో ఈ ఏడాది అక్టోబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉండగా ప్రధాని మార్క్ కార్నీ ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చారు. ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# పాక్ పాచికల్ని పారనీయొద్దు!



పహల్గామ్‌లో 26 మంది నిండు ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనన్న అభిప్రాయం రోజురోజుకూ దేశంలో బలపడుతుండగా పాకిస్తాన్ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడుతోంది. మొదటి నాలుగు రోజులూ ఉలకని, పలకని ఆ దేశం అటుతర్వాత 'తటస్థ దర్యాప్తు' రాగం అందుకుంది. ఆ మర్నాడే అణు బెదిరింపులకు దిగింది. మరోపక్క భద్రతా మండలిలో చడీచప్పుడూ లేకుండా లాబీయింగ్ సాగించి తన పాచిక పారేలా చూసుకుంది. ఇక్కడే మన లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని 'తీవ్రంగా' ఖండిస్తు న్నట్టు తీర్మానం చెబుతున్నా అందులో దాడికి కారణమైన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) సంస్థ పేరు ప్రస్తావనే లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. చైనా ఎప్పటిలాగే పాకిస్తాన్ వాదనతో శ్రుతి కలిపింది. కానీ మన కు చాలా సన్నిహితుడనుకున్న డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి అమెరికాలో మొదలైనా పాక్‌తో ఆ దేశం అంటకాగుతున్న వైనం దిగ్భ్రాంతికరం కాదా? ఈమధ్యకాలంలో బలూచిస్తాన్‌లో రైలును దారిమళ్లించి అనేకుల్ని హతమార్చిన ఉదంతంలో భద్రతామండలి అందుకు కారణమైన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పేరు ప్రస్తావించింది. 2019లో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడి ఉదంతంలో సైతం జైషే మొహమ్మద్ (జేఈఎం) ప్రమేయాన్ని మండలి తీర్మానం ఎత్తి చూపింది. కానీ ఇప్పుడేమైంది? ఇక్కడికొచ్చేసరికి ఈ నీళ్ల నములుడు దేనికి? అమెరికా రూపొందించిన తీర్మానంలో తొలుత ప్రస్తావనకొచ్చిన టీఆర్ఎఫ్ పేరు ఎందుకు ఎగిరిపోయింది? ఏ సంస్థనూ మాటమాత్రంగానైనా ఖండించటానికి ముందుకురాని తీర్మానం 'అంతర్జాతీయ శాంతికీ, భద్రతకూ విఘాతం కలిగించే ఉగ్ర ఘాతుకాలపై అన్నివిధాలుగా పోరాడతాం' అని బడాయి పోవటం చిత్రం కాదా! ఆ ఘనకార్యం మేమే చేశామని విర్రవీగిన సంస్థ పేరెత్తటానికి మండలికున్న అభ్యంతర మేమిటి? అఫ్గాన్‌లో సోవియెట్ సైన్యాన్ని ఎదుర్కొనటానికి అమెరికా ఆశీస్సులతో ఉగ్రవాద శిబిరాలు నడిపిన పాపిష్టి చరిత్ర తమకుందని ఈమధ్యే పాక్ రక్షణమంత్రి అంగీకరించాడు. తాజా పరిణామాల నేపథ్యంలో అలాంటి లాలూచీ ఇంకా కొన సాగుతున్నదనుకోవాలా? ప్రధాని నరేంద్ర మోదీ మొన్న బిహార్‌లో కావొచ్చు... తాజాగా 'మన్ కీ బాత్'లో కావొచ్చు, పహల్గామ్ ఉదంతంలో బాధితులకు సరైన న్యాయం దక్కేలా చేస్తామని స్పష్టం చేశారు. పాత్ర ధారుల్ని, సూత్రధారుల్ని తీవ్రాతితీవ్రంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మంచిదే. అయితే ఈ కృషి బహుముఖాలుగా వుండాలి. ఉగ్రవాదుల్ని పట్టి బంధించటానికి ప్రయత్నించటంతో పాటు అంతర్జా తీయంగా పాక్‌ను ఏకాకిని చేయటానికి కృషి చేయాలి. ఉగ్రసంస్థల్ని కిరాయి ముఠాలుగా వాడుకుంటున్న దాని నైజాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టాలి. పాకిస్తాన్ తెరవెనకుండి భద్రతామండలి తీర్మానంలో చేయించిన మార్పులు చిన్నవేమీ కాదు. ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్‌తో పాక్ సర్కారు ఎంతగా చెట్టపట్టాలు వేసుకున్నదో మండలిలో జరిగిన పరిణామాలే తేటతెల్లం చేస్తున్నాయి. తీర్మానంలో టీఆర్ఎఫ్ ప్రస్తావన లేకుండా చేసిన క్షణాల్లోనే ఆ ఉగ్ర సంస్థ తన పాత ప్రకటన 'అధికారికమైనది' కాదంటూ స్వరం మార్చటం గమనించదగ్గది. దాడి జరిగిన వెంటనే తామే అందుకు కారకులమని చెప్పిన ఆ సంస్థ మండలిలో పాక్ వాదనకు అనుగుణంగా ఆ ప్రకటన తమది కాదనటమే కాదు... నింద మోపటం కోసం భారత సైన్యం కావాలని చేసిన పనిగా ఆ ఉదంతాన్ని వక్రీకరించే ప్రయత్నం చేసింది. లష్కరే తోయిబా విషపుత్రిక అయిన టీఆర్ఎఫ్ 2020 నుంచీ జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు పాల్పడుతోంది. ఆ సంస్థను మన దేశం నిషేధించింది కూడా! ఏదో విధంగా మన దేశాన్ని ఇబ్బందులపాలు చేయటం కోసం ఏళ్ల తరబడి స్వయంగా నిర్మించిన ఉగ్రవాద సాలెగూటిలో తానే చిక్కుకుని పాకిస్తాన్ తరచు విలవిలలాడుతోంది. 2015లో పెషా వర్ కంటోన్మెంట్ ప్రాంతంలోని పాఠశాలపై ఉగ్రవాదులు ఒక్కుమ్మడిగా విరుచుకుపడి 140 మంది బాలబాలికల్ని కాల్చిచంపారు. ఆ మరుసటి ఏడాది క్వెట్టాలో పోలీసు శిక్షణ కేంద్రం ఆవరణలోకి ప్రవేశించి 60 మందిని హతమార్చారు. ఒక యూనివర్సిటీపై దాడికి దిగి ప్రొఫెసర్‌తోపాటు 20 మంది విద్యార్థుల ప్రాణాలు తీశారు. ఈ మాదిరి ఉదంతాలు ఎన్నెన్నో. అయినా పాకిస్తాన్ వైఖరిలో ఆవగింజంతైనా మార్పు లేదు. పశ్చాత్తాపం అసలే లేదు. పహల్గామ్ దాడిని ఖండించకుండా పర్యాటకులు ప్రాణాలు కోల్పోవటం విచారకరమంటూ ప్రకటన చేసి చేతులు దులుపుకుంది. పాకిస్తాన్ తీరు మారదని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దబాయింపు చూస్తే తెలుస్తుంది. ఉగ్రదాడిపై ఆయనగారికి 'తటస్థ, పారదర్శక, విశ్వసనీయ' దర్యాప్తు కావాలట! అసలు తన ఎన్నికే సంశయాస్పదమైంది. పాక్ సైన్యం అండదండలతో అందలమెక్కిన చరిత్ర షెహబాజ్‌ది. 2016నాటి పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఇరు దేశాల సంయుక్త దర్యాప్తును నీరు గార్చిందెవరు? పాక్ ప్రతినిధులు మన దేశం వచ్చి దర్యాప్తులో పాల్గొని వెళ్లగా, మన ప్రతినిధి బృందాన్ని మాత్రం పాక్ గడ్డపైకి అనుమతించని వైనం, తాము సేకరించిన సాక్ష్యాలను భారత్‌తో పంచుకోని తీరు షెహబాజ్ మరిచారా? 2008 నాటి ముంబై పేలుళ్ల ఉదంతంలో ఇచ్చిన సాక్ష్యాధారాలకు ఏ గతి పట్టించారో గుర్తులేదా? అణ్వాయుధ దాడికి సిద్ధమంటూ బెదిరింపులకు దిగుతున్న పాక్ దుష్ట పన్నాగాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలి. అందుకు దౌత్యపరంగా మరింత కృషి చేయాలి. దాంతోపాటు అన్నివిధాలా సంసిద్ధతలు పెంపొందించుకోవాలి. సామాజిక మీడియాలో కశ్మీరీలపై విద్వేషాన్ని కక్కే అవాంఛనీయ శక్తుల ఆటకట్టించాలి. ఇది కలసికట్టుగా నిలబడాల్సిన కాలమని చాటాలి.

# లోపాలు సరిదిద్దాలి



ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్సి-2025 నోటిఫికేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు ఏప్రిల్ 20న వెలువడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డిఎస్సి నోటిఫికేషన్ రాకతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. మొత్తం 16,347 పోస్టులను ప్రభుత్వం భర్తీకి ఉపక్రమించడం స్వాగతించదగినది. కాగా నోటిఫికేషన్‌లో లోపాలు ఉద్యోగార్థులను కలవరపెడుతున్నాయి. పలు సందిగ్ధాలకు, గందరగోళానికి గురి చేస్తున్నాయి. మెగా డిఎస్సి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన నాటి నుంచి గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్సి డిమాండ్ ముందుకొచ్చింది. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలను నూటికి నూరు శాతం గిరిజనులకే ఇచ్చేందుకు ఉద్దేశించిన జిఒ నెం.3 ని తాము అధికారంలోకొస్తే పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ఆ ప్రస్తావన లేకుండా డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి టీచర్ పోస్టులు భర్తీ చేయ నిశ్చయించడం చూస్తుంటే ఎన్నికల్లో గిరిజన నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని మర్చిపోయినట్లే కనిపిస్తోంది. డిఎస్సిలో 1,600 పోస్టుల వరకు ఏజెన్సీలో వస్తాయి. వాటిని ఇతర ప్రాంతాల వారితో నింపితే స్థానిక గిరిజన యువతకు తీరని అన్యాయం వాటిల్లుతుంది. ఇది రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు ప్రాంత గిరిజనుల హక్కులను కాలరాయడమే. యువత ఆందోళన బాట పట్టారు. మే 2న ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చారు. వారి ఆందోళనలతోనైనా జిఒనెం.3ని పునరుద్ధరించి ఎన్నికల హామీని టిడిపి కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి కోసం ఆర్డినెన్స్ తేవాలి. డిఎస్సి అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్న మరో అంశం మార్కుల అర్హత. ఎస్‌టి, ఎస్‌సి, బిసి, వికలాంగులకు తప్పనిసరిగా 45 శాతం మార్కులుండాలన్న నిబంధన ఆయా తరగతుల అభ్యర్థులకు నష్టం కలిగిస్తుంది. ఇంటర్‌లో, డిగ్రీలో, పి.జి.లో 40 శాతం మార్కులొచ్చిన వారు డైట్, బిఇడి చేశారు. టెట్‌లో ఉత్తీర్ణత పొంది ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. కాగా ఇప్పుడు 45 శాతం మార్కులను అర్హతగా పేర్కొనడం వలన వీరందరూ అన్యాయానికి గురవుతారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగులను ఉద్యోగానికి దూరం చేసే, సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే 'మార్కుల' నిబంధనను సడలించాలని ఉద్యోగార్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. అభ్యర్థులను బాధిస్తున్న మరో ముఖ్యాంశం వయో పరిమితి. ఏడేళ్లుగా డిఎస్సి లేదు. ఉద్యోగం కోసం ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న వారి వయసు మీరిపోయింది. ఈ తరుణంలో వయో పరిమితి 47 ఏళ్లు చేయాలన్న డిమాండ్ సహేతుకమైనది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలి. అభ్యర్థులు పరీక్షలకు ప్రిపేర్ కావడానికి కనీసం 90 రోజుల సమయం ఇవ్వాలని, ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండాలన్న కోర్కెలూ వ్యక్తమవుతున్నాయి. మెగా డిఎస్సి కోసం కూటమి ప్రభుత్వం తొలి సంతకం చేసి దాదాపు పది నెలలైంది. నిరుద్యోగుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా నోటిఫికేషన్ వచ్చింది. కసరత్తుకు బోల్డంత సమయం తీసుకుంది. విద్యాహక్కు చట్టం, హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల పోస్టులు భర్తీ కావాలని ఉపాధ్యాయ సంఘాలు తెలుపుతున్నాయి. పాఠశాలల విలీనం, జాతీయ విద్యా విధానం అమలు వలన టీచర్ పోస్టులు తగ్గుతున్నాయన్న ఆవేదన నెలకొంది. కూటమి ప్రభుత్వం మాత్రం 16 వేల చిల్లర పోస్టులనే భర్తీ చేస్తోంది. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణతో లింకు పెట్టి కొన్ని నెలలపాటు నోటిఫికేషన్‌ను వాయిదా వేసింది. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణపై పాక్షికంగానే నిర్ధారణ చేశారు. ప్రస్తుతానికి రాష్ట్రం యూనిట్‌గా అమలు చేస్తున్నారు. జనగణన పూర్తయ్యాక జిల్లా యూనిట్ అని చెబుతున్నారు. ఎస్‌సి వర్గీకరణ పద్ధతి ప్రకారం జరగలేదంటూ న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు పడ్డాయి. వాటిపై కోర్టులు ఏం నిర్ణయాలు తీసుకుంటాయో వేచి చూడాలి. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు 1న అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తారు. ఇంతా చేసినా విద్యా సంవత్సరంలో రెండు నెలలు గడిచిపోతాయి. ఏమైనా అవాంతరాలొస్తే ఇంకెంత ఆలస్యమవుతుందో! నోటిఫికేషన్‌లో లోపాలను సరిదిద్ది రీనోటిఫికేషన్ ఇచ్చి తమకు న్యాయం చేయాలన్న అభ్యర్థుల డిమాండ్‌ను అంగీకరించడం ప్రభుత్వ ధర్మం!

# తీర్పులు అనుకూలంగా లేకపోతే సుప్రీంనే బెదిరిస్తారా?



ఇటీవల వక్ఫ్ సవరణ చట్టం 2025 విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీం ధర్మాసనం వక్ఫ్ భూముల విషయంలో ఎవరి తరపున నిలుస్తోంది అన్న సందేహాన్ని బలంగా ప్రచారంలో పెడుతున్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై స్పందించే ముందు, న్యాయ వ్యవస్థ పాత్రను సరైన దృక్పథంతో విశ్లేషించడం అవసరం. వక్ఫ్ చట్టంపై కోర్టు చేసిన వ్యాఖ్యలు విచారణలో భాగంగా వచ్చిన ప్రశ్నలే కానీ, మత పక్షానికో, రాజకీయ పక్షానికో అనుకూలంగా ప్రతికూలంగా చేయబడినవి కావు. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం. తుది తీర్పు ఇంకా రావలసి ఉంది.

### ఘటన స్థాయిని బట్టే స్పందన..

ఇటీవలే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆక్షేపణలు ఇదే విషయాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆలస్యంగా స్పందించడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది సూత్రాలకు కట్టుబడి న్యాయం చెప్పే కోర్టు ధోరణికి ఉదాహరణ. ఇక 'మణిపూర్ విషయంలో కోర్టు తీవ్రంగా స్పందించింది, కానీ పశ్చిమ బెంగాల్‌లో అటువంటి స్పందన ఎందుకు లేదు' అనే విమర్శలు చేస్తున్నారు. ఇక ఆయా రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలకు పరస్పరం పోలికే లేదు. మణిపూర్లో జరిగిన ఘోరం, మహిళలపై సామూహిక లైంగికదాడి, నగ్నంగా నడిరోడ్డుపై వదిలేయడం, సామాజిక అస్థిరత మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగిన అశాంతి – ఇవన్నీ మానవ హక్కుల ఉల్లంఘనకు అత్యంత దారుణ ఉదాహరణలు.. సుప్రీంకోర్టు స్పందన కూడా ఆ ఘాతుక స్థాయికి తగినట్టుగానే తీవ్రంగా వ్యక్తమైంది.

### విశ్లేషణ అవసరం!

పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఎన్నికల హింస, పోలీసు వ్యవస్థ వైఫల్యం వంటి అంశాలు కోర్టు విచారిస్తోంది. కానీ రెండింటికీ ఒకే స్థాయిలో, ఒకే తీరు స్పందించాలన్న తర్కం అర్థరహితం. న్యాయవ్యవస్థ ప్రతి అంశాన్ని దాని దృఢత, స్థితిగతుల మేరకే పరిశీలిస్తుంది. ఎప్పుడూ ఒకే తీరుగా, ఒకే స్థాయిలో స్పందించదు. మణిపూర్ విషయంలో సుప్రీంకోర్టు స్పందించకపోతే, బాధిత మహిళలకు న్యాయం ఎక్కడి నుంచి లభిస్తుంది ఇది ఆలోచించాల్సిన విషయం కాదా! వక్ఫ్ సవరణ చట్టం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసి వ్యాఖ్యలను మతపరమైన కోణంలో చూస్తున్నారు. కానీ, అది భూయాజమాన్యం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ బాధ్యత




వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలకు సంబంధించిన చర్చ. ఈ నేపథ్యంలో కోర్టు ప్రశ్నలు చాలా సహజమైనవి. అవి మత వ్యతిరేకమైనవి కాదు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో సమీక్షకు తావిస్తే తప్పు కాదు. కోర్టు తీర్పులను, వ్యాఖ్యలను నిందించే ముందు, వాటిలోని గంభీరతను, అవసరాన్ని గుర్తించాలి. విమర్శలకంటే విశ్లేషణ అవసరం అదే ప్రజాస్వామ్యాన్ని బలపరిచే మార్గం. న్యాయవ్యవస్థ ప్రశ్నకు అతీతం ఏంకాదు. విమర్శ ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమే! అయితే అది వివేచనతో, విజ్ఞతతో ఉండాలి. లేకపోతే న్యాయం అన్న భావనే అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com